నేటి కందం-నేటికి అందం

మురియగ మంచి మనస్సులు
సరగున రేవంత రెడ్డి చక్కని గతిలో
బరగెడి గిగ్ కార్మికులకు
విరివిగ పెంపొంద చేసె బీమా సొమ్మున్ !!

(డెలివరీ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్లు,కొరియర్ తెచ్చే వారు సుఖంగా ఉండడానికి, వారి బీమా మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వం 15 లక్షలకు పెంచింది. ఇది వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

పాలకుల వైఫల్యం
ప్రశ్నిస్తే విద్రోహులు
అంటున్నరు ఫాసిస్టు
అధికార వ్యామోహులు.
ప్రజాస్వామ్య వ్యవస్థను
పాతరేస్తే చూడాలా
బహుపరాక్ వ్యక్తి పూజ
భజనచేస్తూ వేడాలా

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 17-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:92 పేజీలు:6 వెల: రూ.1/-

ఇద్దరు ఉగ్రవాదులు హతం!

ఏఐఐ ఇనిఞనీబీనిబివతీ। ఇద్దరు ఉగ్రవాదులు హతం!
మృతుల్లో లష్కరే కమాండర్ లతీఫ్ భట్..
ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లకు గాయాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోంది. ఈ క్రమంలో కుల్గామ్ జిల్లాలో భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో లష్కరే తోయిబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతుల్లో ఆ సంస్థకు చెందిన కమాండర్ లతీఫ్ భట్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఎన్‌కౌంటర్ సమయంలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడినట్లు వెల్లడించారు.

హతమైన ఉగ్రవాదులు గత వారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు వారి కదలికలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కుల్గామ్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమవడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

ఎన్‌కౌంటర్ అనంతరం సంబంధిత ప్రాంతంలో భద్రతా బలగాలు సోదాలు ముమ్మరం చేశాయి. మరికొందరు ఉగ్రవాదులు ఎక్కడైనా దాక్కున్నారా? అనే కోణంలో తనిఖీలు చేపట్టాయి. గాయపడిన ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల వివరాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. ప్రాంతంలో భద్రతా చర్యలు కొనసాగుతున్నాయి.

రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి: కవిత

నిజామాబాద్, నవంబరు 16: తెలంగాణ రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కరువు పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర చరిత్రలో రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని కవిత విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కరువు పరిస్థితులను ప్రస్తావించకపోవడం బాధాకరమని అన్నారు.

ఇదిలా ఉండగా.. ఇంటర్ బోర్డు రద్దు అంశంపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కవిత వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మరోవైపు ఖైరవ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, యాత్రను విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై కవిత మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా.. ఈ వ్యవహారాన్ని చట్టపరంగా కూడా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీసీఐడీకి లేఖల ద్వారా సంబంధిత ఆధారాలను అందజేస్తున్నామని వెల్లడించారు. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని.. వాస్తవాలు ప్రజల ముందుకు రావాలని అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతులకు నష్టపరిహారం, ఇంటర్ బోర్డు అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే, మరోవైపు హరీశ్ రావుపై విమర్శలు, చట్టపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏఐ దుర్వినియోగానికి చెక్ పెట్టండి.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి చిరంజీవి వినతి



హైదరాబాద్, నవంబర్ 16: ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నకిలీ గుర్తింపులకు వ్యతిరేకంగా మరింత పటిష్ఠమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని మెగాస్టార్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సలహా మేరకు కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఫొటోలను సోషల్ మీడియాలో మెగాస్టార్ పంచుకున్నారు.

ఈనెల 2 హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తనయుడు రామ్ చరణ్‌తో కలిసి చిరంజీవి సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమయంలో డీప్‌ఫేక్ ముప్పుపై అమిత్ షాతో చర్చించినట్లు చిరంజీవి వెల్లడించారు. ఆయన సూచన మేరకే కేంద్ర హోంశాఖ, సమాచార, ప్రసార శాఖలను ఉద్దేశించి రూపొందించిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అందజేసినట్లు తెలిపారు.

ఈ అంశాలపై సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు తీసుకువెళ్తామని హామీ ఇచ్చిన కిషన్‌రెడ్డికి చిరంజీవి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి పౌరుడి భద్రతతో పాటు, కళాకారుల గౌరవం, గుర్తింపు, సృజనాత్మక హక్కులను పరిరక్షించడం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. సాంకేతికత సృజనాత్మకతను పెంపొందించాలే తప్ప.. వ్యక్తుల గౌరవానికి భంగం చేయకూడదని తన ఎక్స్ పోస్టులో చిరంజీవి అభిప్రాయపడ్డారు.

అక్వాన్ తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 16: అక్వాన్ తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈరోజు (సోమవారం) రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఇవాళ సాయంత్రానికి వాయుగుండంగా ఆ తదుపరి తుపానుగా బలపడే సూచనలు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు.

తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. కేంద్ర బృందం చేసిన సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆజ్ఞాపించారు. ఈ నెల 19, 20వ తేదీల్లో కోస్తాంధ్ర తీరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. అర్నబ్ తరహాలోనే ఈ తుపాను ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు సహా వివిధ జిల్లాల్లో ప్రభావం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

పోలీస్ శాఖల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం శుభపరిణామం: డీజీపీ ఆనంద్



హైదరాబాద్, నవంబర్ 16: పోలీస్, మార్షల్ బ్యాండ్ సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఈరోజు (సోమవారం) హకీంపేట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలను డీజీపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీస్ బ్యాండ్ బలగాలు.. క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా చెప్పుకొచ్చారు. ఈ ఏడాది పోటీల్లో తొలిసారిగా మహిళా బ్యాగ్పర్లు పాల్గొనడం అభినందనీయ మన్నారు. సీఆర్పీఎఫ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి మహిళా బ్యాగ్పర్ల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు.

పోలీస్ శాఖల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం శుభపరిణామమని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాండ్ బృందాలకు తెలంగాణ తరఫున సాదర స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శించాలన్నారు. హైదరాబాద్ బిర్యానీ, హలీమ్ రుచులను ఆస్వాదించడం మర్చిపోవద్దని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాండ్ బృందాలకు తెలిపారు. గతంలో నక్సలైట్లకు వ్యతిరేకంగా సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు కలిసి పనిచేశారని గుర్తుచేశారు. దేశ భద్రతలో పోలీస్ బలగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

శ్రవణా నక్షత్రం సందర్భంగా తిరుమలలో వైభవంగా పుష్పాల ఊరేగింపు



తిరుపతి, నవంబర్ 16: తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తిక మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు సోమవారం తిరుమలలో ఘనంగా జరిగింది. తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూ జలు నిర్వహించారు.టీటీడీ సాధికారిక మండలి చైర్మన్ ,టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు కలిసి పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకువచ్చారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏవైనా తెలియక దోషాలు జరిగి ఉంటే ఆ దోష నివారణకు బ్రహ్మోత్సవాల తర్వాత వచ్చే కార్తీక మాసంలో శ్రీవారి జన్మనక్షత్ర మైన శ్రవణా నక్షత్రం రోజున పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయమానంగా పుష్పయాగం జరుగు తుందన్నారు. ఇందుకోసం 16 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలను వినియోగి స్తామని చెప్పారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారని వెల్లడించారు.

మేడ్చల్ జిల్లాలో ముసుగు దొంగల కలకలం.. ఏడాదిలో ఎనిమిది చోరీలు

మేడ్చల్, నవంబర్ 16: జిల్లాలోని పర్వతాపూర్ బీపీఎం గ్రీన్‌ల్యాండ్ కాలనీలో ముసుగులు ధరించిన దొంగల ముఠా స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ ముఠా ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని వరుసగా దొంగతనాలకు పాల్పడుతోంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు దొంగలు కాలనీల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఏడాది కాలంలో ఈ ప్రాంతంలో మొత్తం ఎనిమిది చోరీలు జరిగినట్లు తెలుస్తోంది. కేవలం రెండు నెలల్లోనే నాలుగు దొంగతనాలు చోటుచేసుకోవడం స్థానికులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.దొంగలు చోరీలకు పాల్పడే ముందు కాలనీలో రెక్కీ నిర్వహిస్తున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. కొన్ని ఇళ్ల వద్ద రాళ్లు పెట్టి గుర్తులు కూడా పెడుతున్నట్లు చెబుతున్నారు. దొంగల ముఠా పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముసుగులు ధరించిన దుండగులు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు.. చేతుల్లో ఆయుధాలు పట్టుకుని తిరుగుతుండటం స్థానికంగా కలకలం రేపుతున్నాయి.కొందరు దుండగులు ఇళ్ల పరిసరాలను పరిశీలిస్తూ అనుమానాస్పదంగా తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. వరుస చోరీలు, దొంగల సంచారంతో గ్రీన్‌ల్యాండ్ కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని కోరుతున్నారు. వరుసగా ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగలు చోరీలకు పాల్పడుతుండటంతో కాలనీలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్న పరిస్థితి.

థాయ్‌లాండ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 11 మంది మృతి, 36 మందికి గాయాలు



న్యూ ఢిల్లీ, నవంబర్ 16: థాయ్‌లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఫుకెట్ ద్వీపంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున వాహనాల అద్దె వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వాణిజ్య భవనంలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే అవి పక్కనే ఉన్న పలు భవనాలకు వ్యాపించాయి. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 36 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు.

స్థానిక కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 3.17 గంటలకు ఫాంగ్ ముమాంగ్ సాయి కోర్ రోడ్డులోని భవనంలో మంటలు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దాదాపు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఐదు వాణిజ్య యూనిట్లు దెబ్బతిన్నాయి. భవనం సమీపంలో పార్క్ చేసిన పలు ద్విచక్ర వాహనాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన 36 మందిని ఆస్పత్రులకు తరలించగా.. వారిలో 15 మంది థాయ్ జాతీయులు, ఒకరు మయన్మార్ దేశస్థుడు ఉన్నట్లు రాయిటర్స్ తెలిపింది. మృతులు, క్షతగాత్రుల్లో పర్యాటకులు ఎవరూ లేరని పోలీసులు వెల్లడించారు.భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో సుమారు 100 మోటార్ సైకిళ్లు పార్క్ చేసి ఉన్నాయని పటాంగ్ మున్సిపాలిటీ డిప్యూటీ మేయర్ సనకోర్న్ కీసిన్ తెలిపారు. వాహనాల్లోని ఇంధనం, రబ్బరు టైర్లు, ప్లాస్టిక్ భాగాల కారణంగా మంటలు వేగంగా వ్యాపించినట్లు వివరించారు. మంటల నుంచి తప్పించుకునేందుకు భవనంలోని కొందరు పై అంతస్తులకు వెళ్లగా.. దట్టమైన పొగ కారణంగా బయటకు రావడం కష్టమైంది. పొగ పీల్చడం వల్లే ఎక్కువ మంది మరణించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. అయితే, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. తుపాను సమయంలో భవనం ముందు ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండొచ్చని ఫుకెట్ గవర్నర్ చోటెనారిన్ కెర్డ్‌సోమ్ ప్రాథమిక విచారణలో వెల్లడించినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

684 టన్నుల ఏకశిలతో భారీ నందీశ్వర స్వామి విగ్రహ నిర్మాణం.

-రూ.9 కోట్ల వ్యయంతో సువర్ణ శృంగ నందీశ్వర విగ్రహ నిర్మాణానికి శ్రీకారం
– శిలా పనులను ప్రారంభించిన జగ్గారెడ్డి, నిర్మల
-ఆధ్యాత్మిక మహాక్రతువులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి – జగ్గారెడ్డి

సంగారెడ్డి నవంబరు 16(నేటి నిజం (ప్రతినిధి) జిల్లా పరిధిలోని ఫసల్‌వాదిలో ఉన్న శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మరో అపూర్వ ఆధ్యాత్మిక నిర్మాణానికి వేదికగా నిలుస్తోంది. విద్యాపీఠం ప్రాంగణంలో నిర్మితమవుతున్న శ్రీ కైలాస ప్రస్తార మహామేరు ప్రాజెక్టులో భాగంగా, సుమారు రూ.9 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సువర్ణ శృంగ నందీశ్వర స్వామి భారీ ఏకశిలా విగ్రహ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మల హాజరయ్యారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు, భారీ ఏకశిలకు పూజలు చేసి విగ్రహ నిర్మాణ శిలా పనులను లాంఛనంగా ప్రారంభించారు.

684 టన్నుల ఏకశిలతో అరుదైన నిర్మాణం.

ఈ మహత్తర విగ్రహ నిర్మాణం కోసం సంగారెడ్డి సమీపంలోని ఎర్రనూర్ గుట్టల నుంచి 684 టన్నుల బరువున్న భారీ ఏకశిలను సేకరించారు. 32 అడుగుల పొడవు, 19.5 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు కలిగిన ఈ శిలతో నందీశ్వర స్వామి భారీ విగ్రహాన్ని రూపొందించనున్నారు. ఈ ఏకశిలను 284 చక్రాలు కలిగిన ప్రత్యేక భారీ వాహనం ద్వారా త్వరలో ఫసల్‌వాది విద్యాపీఠానికి తరలించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

మహాక్రతువులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వర శర్మ సిద్ధాంతి చేపట్టిన ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం సంగారెడ్డి ప్రాంతానికి గర్వకారణమని అన్నారు. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా ఇంతటి భారీ నందీశ్వర స్వామి విగ్రహాన్ని నిర్మించాలనే సంకల్పం అభినందనీయమని కొనియాడారు. ఈ బృహత్తర కార్యక్రమం వెనుక మహేశ్వర శర్మ సిద్ధాంతి కృషి, పట్టుదల, ఆధ్యాత్మిక సంకల్పం ఉన్నాయని ప్రశంసించారు.

ఈ మహాక్రతువును విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా ఎవరికి తోచినంత వారు విరాళాలు అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు, భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ ఆధ్యాత్మిక నిర్మాణానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.తాను సైతం వ్యక్తిగతంగా ఈ కార్యక్రమంలో భాగస్వామినవుతానని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని జగ్గారెడ్డి ప్రకటించారు. అంతేకాకుండా ఆశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ విగ్రహ నిర్మాణం పూర్తయితే ఫసల్‌వాది దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు.

మహామేరు ఆధ్యాత్మిక విశిష్టతపై వివరణ

అంతకుముందు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి నందీశ్వర స్వామి విగ్రహ నిర్మాణ విశిష్టతతో పాటు శ్రీ కైలాస ప్రస్తార మహామేరు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. ఇంతటి భారీ ఏకశిలను గుర్తించి, దానితో నందీశ్వర స్వామి విగ్రహాన్ని రూపొందించాలనే సంకల్పం అత్యంత అరుదైన విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, పలువురు కాంగ్రెస్ నాయకులు, విద్యాపీఠం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గన్‌పాయింట్‌లో బెదిరించి.. ఎస్‌యూవీతో పరారీ.. సరిహద్దులో అలర్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 16:గన్‌పాయింట్‌లో బెదిరించి ఓ ఎస్‌యూవీని ఎత్తుకెళ్లారో ఈ ఘటన పఠాన్‌కోట్-జమ్మూ జాతీయ రహదారిపై జరిగింది. ఫుడ్ అండ్ షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. దీంతో పంజాబ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో భద్రతను పెంచారు. ఆ వాహనాన్ని ఉగ్రదాడికి వాడుతారన్న అనుమానంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. డ్రైవర్ ఛాతిలోకి ఓ వ్యక్తి పిస్తోల్ చూపి, మహేంద్ర ఎక్స్‌యూవీ500 వాహనంతో పరారీ అయ్యాడు. ఎస్పీ మన్‌ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు.వెహికల్‌ను స్నాచింగ్ తర్వాత నిందితుడు పంజాబ్ దిశగా వెళ్లినట్లు తేల్చారు. గుర్తు తెలియని వ్యక్తిపై సుజన్‌పుర్ పోలీసులు కేసు రిజిస్టర్ చేయనున్నారు. ఈ ఘటనతో అప్రమత్తత ప్రకటించారు. 2015లో దీనానగర్‌లో మిలిటెంట్లు ఓ కారును హైజాక్ చేసి దాంతో పోలీసు స్టేషన్‌పై దాడి చేశారు. ఆ తర్వాత 2016లో పఠాన్‌కోట్‌లో వాహ నాలను హైజాక్ చేసి ఉ గ్రవాదులు దాడులకు పాల్పడిన విషయం తెలి సిందే. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. డౌన్‌టౌన్ 44 షాపింగ్ మాల్‌కు తన భార్య , కుమార్తెతో కలిసి వెళ్లినట్లు బాధిత వ్యక్తి తెలిపారు.

హనీట్రాప్ గూఢచర్యంలో ఒక భాగం.. వాయుసేన చీఫ్ కీలక వ్యాఖ్యలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: విదేశీ సైబర్ దాడులకు లొంగనంత సురక్షితంగా భారత మిలటరీ వ్యవస్థ, దాని పరిశోధన విభాగాలున్నాయని.. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్ వలపు వలలు విసిరే మార్గాన్ని ఎంచుకుందని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ పేర్కొన్నారు.

'మిలటరీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అనేది పబ్లిక్ నెట్‌వర్క్ నుంచి వేరుగా ఉంటుంది. దానిపై సైబర్ దాడికి పాల్పడడం అసాధ్యం. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్.. సాంకేతికంగా దెబ్బతీయలేక.. హనీ ట్రాప్ పేరుతో మనుషులను ఉపయోగిస్తోంది. పబ్లిక్ సెక్టార్ లాబోరేటరీ సిబ్బంది, ప్రైవేట్ సెక్టార్‌లోని డిఫెన్స్ కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా ప్రేమ పేరుతో ట్రాప్ చేస్తున్నారు.

వలపు వలలు అనేవి ఇంటెలిజెన్స్ గూఢచర్యంలో చిన్న భాగం. నిజానికి ఇది వలపు వల కాదు. గూఢచర్యంలో ఓ భాగం. ఈ రోజుల్లో ఇది సోషల్ మీడియా వేదికగా జరుగుతుంది. మొత్తం గూఢచర్య మార్గాలను పరిగణనలోకి తీసుకుంటే హనీట్రాప్.. ఒక అంశం మాత్రమే. లోన్స్ పేరుతో, మార్కెట్ పేరుతో.. ఇలా చాలా ఉన్నాయి. ఇలాంటి వాటిపై నిరంతర దృష్టి పెడుతున్నాం. నిశితంగా పరిశీలిస్తూ.. కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. మిలటరీ నెట్‌వర్క్‌పై సైబర్ దాడులకు పాల్పడలేరు. కానీ.. వ్యవస్థ లోపలి నుంచి ప్రమాదం పొంచి ఉంది. అందుకే దానికి సంబంధించి కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం. ట్రైనింగ్ ఇచ్చేటప్పుడే ఉద్యోగులకు ఈ విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం' అని మార్షల్ అశుతోశ్ తెలిపారు.

యువభారతానికి నైపుణ్య విద్య అండ కావాలి !

(17 నవంబర్ "అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం" సందర్భంగా)

ఏ దేశానికి లేని ఓ అద్భుత వరం భారతమాత చెంత ఉన్నది. యువశక్తి అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ ముందు వరుసలో ఉంటూ ''యువభారత్''గా పిలువబడుతున్నది. ఆఫ్రికాలో ప్రజల సగటు వయస్సు 19 ఉండగా చైనాలో 40, యూఎస్‌లో 44, ఇటలీలో 48, జర్మనీలో 46, జపాన్‌లో దాదాపు 50గా నమోదు అవుతున్నది. భారత్‌లో జనాభా సగటు వయస్సు 29గా లెక్కించబడింది. యువ జనాభా అధికంగా ఉండడం వరంగా మారాలంటే డిజిటల్ యుగానికి సమానంగా, అంతర్జాతీయ స్థాయి విద్యా బోధనలు జరగాలి. విద్యా విధానంలో నాటి పాత పోకడలు కొనసాగితే భారత యువశక్తి శాపంగా మారి దేశం అశాంతికి కేంద్రంగా మారుతుందని గమనించాలి. డిజిటల్ యుగానికి తగిన నైపుణ్య విద్య అవసరాన్ని ప్రచారం చేయడానికి ప్రతి ఏట 17 నవంబర్ కృరోజు "అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం (ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026 అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవం ఇతివృత్తంగా "విద్యార్థులు – దేశాభివృద్ధి : ఎరైజ్ ఎజెండా అమలుతో సుస్థిరాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకున్నారు.

ఆధునిక విద్య అందని ద్రాక్షేనా !

ఎనిమిది బిలియన్లకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో భారత జనాభా 1.4 బిలియన్లు దాటింది. నేటి విద్యావిధానం ప్రపంచ స్థాయి నవ్య శాస్త్రసాంకేతిక శాస్త్రాల స్థాయికి చేరడానికి భారతదేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశాల్లో మార్పులు, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, టీచర్ల నియామకాలు, ఉపాధ్యాయ శిక్షణ, ఉపాధ్యాయుల వేతనాలు, పాఠశాలల విస్తరణ, ఆధునిక సదుపాయాలు తక్షణమే అవసరం అవుతాయని తెలుసుకోవాలి. భారత దేశవ్యాప్తంగా 1.4 మిలియన్ల పాఠశాలలు ఉండగా సదుపాయాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. భారత్‌లో 10 – 20 ఏండ్ల వయస్సు కలిగిన బాలలు/యువత 200 మిలియన్లు ఉన్నారు. ఆధార్, యూపిఐ చెల్లింపులు, డిజిటల్‌లాకర్ సౌకర్యాల్లో ముందున్న భారతం పాఠశాల విద్యా ప్రమాణాల్లో వెనుకబడి ఉందని నిపుణులు వాపోతున్నారు. డిజిటల్, ఏఐ విప్లవానికి తగిన విద్యా బోధన భారతానికి అందని ద్రాక్షే అవుతున్నది.

ఆధునికతకు తగిన సెలబస్ రూపకల్పన:

నాణ్యమైన విద్య, ఆ విద్యకు తగిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు బోధించని యెడల మన యువ జనాభా దేశానికి పెనుశాపంగా మారి నిరుద్యోగం మరింత పెరుగుతుంది. మన ప్రస్తుత విద్యా విధానాన్ని తక్షణమే పునర్ సమీక్షించాల్సిన అగత్యం ఏర్పడింది. నాణ్యమైన ఉపాధ్యాయులు, పాఠశాల వసతులు, నిరంతర సెలబస్ రూపకల్పనలు, కొత్త పోకడలకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దారులు వెతకాలి. అగ్ర రాజ్యాల యువత రేపటి కలలను సాకారం చేసుకోవడానికి నేడే నాంది పలుకుతుండగా, భారతం మాత్రం "ఓల్డ్ ఈజ్ గోల్డ్ " అనే నానుడికి లోబడి పాత సిలబస్‌లు, అరకొర అర్హతలకు అతుక్కుపోతూ ఉపాధ్యాయులు/పాఠశాలలతో నత్తనడకన బోధనలు కొనసాగుతున్నాయి. రేపటి అవకాశాలకు నేడే నైపుణ్య పెట్టుబడి పెట్టాలని మరిచి పోతున్నాం, మారడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాం. నూతన విద్యా విధానాన్ని స్థానికతను దృష్టిలో పెట్టుకొని అమలులోకి తీసుకురావాలి.

పాఠశాల స్థాయిలోనే డిజిటల్ పరిజ్ఞాన బీజాలు నాటాలి:

ప్రతి భారతీయ విద్యార్థి చేతికి ఆధార్ కార్డు వలె ఒక కంప్యూటర్ అందజేయాలని, ఒక్క విద్యార్థి వేసి ముద్రలతోనే పని చేసే విధంగా రూపొందించాలని, అమ్మడానికి/మార్చుకోవడానికి వీలు లేకుండా తయారు చేయాలని, అనవసర అంశాలు చూడడానికి తావు లేకుండా ప్రత్యేక కంప్యూటర్లను పంపిణీ చేయాలని సూచిస్తున్నారు. అన్ని పాఠశాలలను వైఫై కనెక్షన్, అపరిమిత డాటా వినియోగం అందుబాటులో ఉండే ఆధునీకరించాలి. కంప్యూటర్ విద్య నేర్పడానికి అర్హులైన శిక్షకులను నియమించి, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఆకర్షనీయ బహుమతులు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. పాఠ్యాంశాలను దాటి నేర్చుకోవడానికి ఇష్టపడే యువత నుంచి అదనంగా ఫీజులు వసూలు చేయాలి. నేటి విద్యా విధానానికి అదనంగా ఈ కంప్యూటర్ లిటరసీ విద్యా బోధన కొనసాగాలి.



-మధుపాళీ
9949700037

మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా యువతను జాగృతం చేయడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా మండల-స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తోన్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)

న్యూఢిల్లీ, నవంబర్ 16:'మై భారత్-జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) డైరెక్టరేట్ ద్వారా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 100 వారాల 'వికసిత్ భారత్ సంకల్ప అభియాన్ కోసం నషా ముక్త్ యువ' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం 9వ వారంలో దేశవ్యాప్తంగా మండల-స్థాయి క్రీడా పోటీలు నిర్వహించింది. ఈ ప్రచార కార్యక్రమం 3వ నెలలో 'బలమైన సమాజాలు, ఆరోగ్యకరమైన యువత' ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమం... క్రీడల ద్వారా క్రమశిక్షణ, సమష్టి కృషి, వ్యసన రహిత జీవనశైలిని ప్రోత్సహించేందుకు చుట్టుపక్కల గ్రామాలు, మండలాలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థి వాలంటీర్లు, స్థానిక యువజన సంఘాలు, కమ్యూనిటీ సభ్యులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా మొత్తం 992 కార్యకలాపాలను నిర్వహించగా... ఇందులో 87,481 మంది విద్యార్థి వాలంటీర్లు, స్థానిక యువజన సంఘాల సభ్యులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం కింద 02.08.2026న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ' ప్రచార కార్యక్రమం... యువతను మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు, ఇతర వ్యసనరూపిత పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం ద్వారా వ్యసన రహిత, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకుసాగుతోంది.

బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, ఢిల్లీ, గౌహతి, జైపూర్, లక్నో, తిరువనంతపురంతో కూడిన 10 ప్రాంతీయ డైరెక్టరేట్ల పరిధిలోని 130కి పైగా సంస్థల నుంచి అందిన క్షేత్రస్థాయి నివేదికల ప్రకారం... ఈ కార్యక్రమంలో పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. వీటిలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, మారథాన్‌లు, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలు ఉన్నాయి. వీటితో పాటు తాడు లాగే పోటీ, రుమాల్ ఝపట్, నిమ్మ కాయ పరుగు వంటి సంప్రదాయ ఆటల పోటీలనూ నిర్వహించారు. లక్షద్వీప్‌లో తిరువనంతపురం ప్రాంతీయ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంప్రదాయ ద్వీప క్రీడల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ ప్రచార కార్యక్రమంలో లింగ సమానత్వానికి ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగా 42,190 మంది మహిళా క్రీడాకారులు ఈ పోటీలు, అవగాహన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రచార సందేశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్రీడా పోటీలతో పాటు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలనూ అనుసంధానించారు. క్రీడాస్ఫూర్తిని నిలబెడతామని... వ్యసన రహిత జీవనశైలిని గడుపుతామని క్రీడాకారులు, రిఫరీలు, కోచ్‌లు, ప్రేక్షకులు చేసిన 'నషా ముక్త్ సంకల్పం' ప్రతిజ్ఞతో ప్రతి పోటీ ప్రారంభమైంది.

భోపాల్, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీలోని ప్రధాన ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో మానసిక ఆరోగ్యంపై సమాచార, విద్య, కమ్యూనికేషన్ (ఐఈసీ) సామగ్రిని పంపిణీ చేశారు. జాతీయ వ్యసన విముక్తి హెల్ప్ లైన్ (14446) గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, తోటివారి ఒత్తిడి (పీర్ ప్రెజర్), వ్యసనాల నుంచి బయటపడే మార్గాలపై అవగాహన పెంచేందుకు వీధి నాటకాలు, మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలు, నినాదాల రచన పోటీలనూ ఈ కార్యక్రమాలకు అనుబంధంగా నిర్వహించారు.స్థానిక యంత్రాంగం, నిపుణు లూ ఈ కార్యక్రమానికి తమ పూర్తి సహకారాన్ని అందించారు. భటిండా, కాసరగోడ్, కోయంబత్తూరులకు చెందిన సీనియర్ పోలీసు అధికారులు, నార్కోటిక్స్ సెల్ అధికారులు, మానసిక వైద్య నిపుణులు, వ్యసన విముక్తి నిపుణులు, పంచాయతీ సర్పంచులు సహా స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం.. ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఆదిలాబాద్, నవంబర్ 16: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. మంచిర్యాల జిల్లాకు చెందిన చంద్రయ్య (53) అనే వ్యక్తి కదులుతున్న రైలు ఎక్కబోయి ప్లాట్‌ఫాం, రైలు మధ్య ఇరుక్కు పోయారు.వివరాల్లోకి వెళితే.. చంద్రయ్య గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేందుకు సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చారు. రైలు కదులుతుండగా హడావుడిగా ఎక్కే ప్రయత్నం చేయడంతో ఆయన అదుపుతప్పి జారి కింద పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన అక్కడ విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ జవాన్లు వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చి అతడిని బయటకు లాగి కాపాడారు.ఈ మొత్తం ఘటన ప్లాట్‌ఫాంపై ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. స్వల్ప గాయాలతో చంద్రయ్య బయటపడ్డారు. కదులుతున్న రైలు ఎక్కవద్దని, తొందరపాటు ప్రాణాలకే ముప్పు అని రైల్వే పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మంచిర్యాల కార్పొరేటర్‌కు జాతీయ అవార్డు



ఆదిలాబాద్, నవంబర్ 16: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ ఏల్పుల రవీందర్ కు జాతీయ ఉత్తమ కార్పొరేటర్ అవార్డు లభించింది. బహుజన సాహితి అకాడమీ నేషనల్ కమిటీ ఏడవ డివిజన్ లో ఆయన చేసిన అభివృద్ధి పనులు, ప్రజా సేవను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

ఢిల్లీలోని కరోల్ బాగ్ లో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు.అనంతరం రవీందర్ మాట్లాడుతూ, ఈ అవార్డు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మేయర్ ధరణి మధుకర్ సహకారం, 7వ డివిజన్ ప్రజల ఆశీస్సుల వల్లే సాధ్యమైందన్నారు.తనను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని, కులమతాలకు అతీతంగా అందరికీ సేవ చేస్తానని తెలిపారు. తనకు సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయంలో కార్తీక శోభ



ఆదిలాబాద్, నవంబర్ 16: నేడు కార్తీక మాసం కార్తీక సోమవారం కావడంతో మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ అంబా అగస్తేశ్వర శివాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించుకున్నారు. అనంతరం శివలింగ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసంలో శివుడిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని భావించే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీతో ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది.

అత్యాధునిక సింక్రోట్రోన్ బీమ్‌లైన్‌ల అభివృద్ధి కోసం ఇటలీలోని ఎలెట్ట్రా 2.0లో సహ-భాగస్వామిగా 7 మిలియన్ యూరోలకు పైగా నిధులు కేటాయించిన భారత్: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 16: 'ఎలెక్ట్రా 2.0' కార్యక్రమం కింద ఇటలీకి చెందిన 'ఎలెక్ట్రా సింక్రోట్రోన్ ట్రైస్టే'తో పరిశోధన బీమ్‌లైన్‌ల పునరాభివృద్ధిలో సహ-భాగస్వామిగా పాల్గొననున్నట్లు భారత్ ప్రకటించింది. 2026-27 నుంచి రాబోయే ఐదేళ్లలో 7 మిలియన్ యూరోలకు పైగా పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి అధునాతన శాస్త్రీయ సహకారం పట్ల తన నిబద్ధతను భారత్ మరోసారి చాటుకుంది.

నిన్న ఎలెట్రా సింక్రోట్రోన్ ట్రైస్టేను సందర్శించిన సందర్భంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ ప్రకటన చేశారు. పరిశోధన మౌలిక సదుపాయాలు, మానవ వనరుల సామర్థ్యాల మెరుగుదలకు భారత్ భాగస్వామ్యం తోడ్పడుతుంది. ఇది భారత్-ఇటలీ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న శాస్త్రీయ భాగస్వామ్యంలో కీలకమైన నూతన దశను సూచిస్తుంది.

నవీకరించిన ఈ సదుపాయాలు... రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, స్ట్రక్చరల్ బయాలజీ, ఇతర శాస్త్రీయ రంగాల్లో పరిశోధనకు నూతన మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తాయి. దీనివల్ల భారత్ సహా ఇతర దేశాల పరిశోధకులకూ ప్రయోజనం చేకూరుతుంది.

ఎలెక్ట్రా 2.0 కార్యక్రమంలో భారత్ భాగస్వామ్యం... భారతీయ పరిశోధనా బృందాలు, ఇటాలియన్ కేంద్రానికి మధ్య 25 ఏళ్ల కు పైగా ఉన్న శాస్త్రీయ సహకారానికి కొనసాగింపు. 1998 నుంచి భారతీయ శాస్త్రవేత్తలు ఎలెక్ట్రాలో పరిశోధన ప్రయోగాలు నిర్వహిస్తూ, ఇప్పటికీ ఇక్కడి సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. ఇటలీ తర్వాత ఎలెక్ట్రాను అత్యధికంగా వినియోగించుకుంటున్న రెండో దేశంగా భారత్ కొనసాగుతోంది. ఇది ఈ కేంద్రంతో మన శాస్త్రీయ సమాజానికి ఉన్న నిరంతర అనుబంధాన్ని ప్రతిబింబిస్తోంది.

భారతీయ పరిశోధనా బృందాల నుంచి ఎలెక్ట్రాకు అందిన 1,100కు పైగా ప్రయోగాత్మక ప్రతిపాదనల ద్వారా ఈ సహకారం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. ప్రతిపాదనల సమర్పణలో 54,140 ప్రతిపాదనలతో ఇటలీ మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచింది. 1,098 ప్రతిపాదనలతో ఫ్రాన్స్ మూడో స్థానంలో ఉంది.

ఎలెక్ట్రా 2.0 కార్యక్రమం కింద... ప్రస్తుతం భారత్-కేంద్రంగా పనిచేస్తున్న ఎక్స్ఆర్‌డీ2, ఎక్స్‌ప్రెస్ బీమ్‌లైన్‌ల సేవలను నిలిపివేసి, వాటి స్థానంలో మెరుగైన సామర్థ్యాలతో కూడిన రెండు కొత్త బీమ్‌లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో మాక్రోమాలిక్యులర్ క్రిస్టలోగ్రఫీ కోసం 'మైక్రో-ఎక్స్ఆర్‌డీ' అనే మైక్రోఫోకస్ బీమ్‌లైన్, అధిక-పీడన వివర్తనం కోసం 'ఎక్స్‌ప్రెస్ సూపర్‌బెండ్ (ఎక్స్‌ప్రెస్-ఎస్‌బీ)' అనే బీమ్‌లైన్ అందుబాటులోకి రానున్నాయి.

ఎలెక్ట్రాలో ప్రత్యేక పరిశోధన మౌలిక సదుపాయాల కోసం భారత్ గతంలో పెట్టిన పెట్టుబడులకు ఈ పునరాభివృద్ధి ఒక కొనసాగింపు. ప్రస్తుతం ఉన్న ఎక్స్ఆర్‌డీ2, ఎక్స్‌ప్రెస్ బీమ్‌లైన్‌లనే రెండు అత్యాధునిక డిఫ్రాక్షన్ బీమ్‌లైన్‌ల నిర్మాణం కోసం ఇటలీతో కలిసి కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (డీఎస్‌టీ) సుమారు రూ. 22 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. 2016 అక్టోబర్ 20న డీఎస్‌టీ కార్యదర్శి ఇటలీ పర్యటన సందర్భంగా ఈ రెండు బీమ్‌లైన్‌లను సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ బీమ్‌లైన్‌లు ప్రారంభమైనప్పటి నుంచి భారతీయ పరిశోధకులు వీటిని సమర్థంగా వినియోగించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 50 నుంచి 60 మంది భారతీయ శాస్త్రవేత్తలు ట్రైస్టేలోని ఈ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ పరిశోధన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

ఇండో-ఇటాలియన్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ ఆఫ్ కోఆపరేషన్ (ఈపీవోనీ) ద్వారా ఎలెక్ట్రా సదుపాయాలను భారతీయ పరిశోధకులు వినియోగించుకునేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ తోడ్పాటునందించింది. ఈపీవోనీ 2022-2024 కింద... ఎలెక్ట్రా బీమ్‌లైన్‌లలో కేటాయించిన షిఫ్టుల్లో ప్రయోగాలు నిర్వహించేందుకు ప్రతి సంవత్సరం 50 మంది భారతీయ పరిశోధకుల పర్యటనల కోసం (ప్రతి సెమిస్టర్‌లో 25 మంది చొప్పున) మూడేళ్లలో డీఎస్‌టీ రూ. 2 కోట్లు మంజూరు చేసింది. ఈపీవోనీ 2025-2027 కార్యక్రమంలోనూ ఈ కేంద్రంలో ప్రయోగాలు నిర్వహించే భారతీయ పరిశోధకులకు మద్దతునిచ్చే ప్రతిపాదన ఉంది. ఇందుకోసం రాబోయే మూడేళ్ల కాలానికి రూ. 1.5 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు.

ఎలెక్ట్రా 2.0 కార్యక్రమం కింద భారత్-కేంద్రిత బీమ్‌లైన్‌ల పునరాభివృద్ధిలో పాల్గొనేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఇప్పటికే తన అంగీకారాన్ని తెలిపింది. ఈ మేరకు ఒక అంగీకార పత్రం (లెటర్ ఆఫ్ ఇంటెంట్)పై సంతకాలు పూర్తయ్యాయి. ఈ పర్యటన సందర్భంగా, రాబోయే ఐదేళ్లలో 7 మిలియన్ యూరోలకు పైగా పెట్టుబడి పెట్టను న్నట్లు ప్రకటించడం ద్వారా ఎలెక్ట్రా 2.0 కార్యక్రమం పట్ల తన నిబద్ధతను భారత్ పునరుద్ఘాటించింది.

ప్రస్తుత బీమ్‌లైన్‌ల విజయవంతమైన అభివృద్ధి, వినియోగం ద్వారా పొందిన అనుభవంతో... భారత్ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించనుంది. ఇరు దేశాల మధ్య తదుపరి దశ శాస్త్రీయ సహకారం కోసం ఉన్నతీకరించిన పరిశోధన మౌలిక సదుపాయాల కల్పనకు ఇది తోడ్పడుతుంది.

ఎలెక్ట్రా 2.0 కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా భారత్ ఈ ఇటాలియన్ పరిశోధనా కేంద్రంతో తన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకోనుంది. అధునాతన, ప్రత్యేక శాస్త్రీయ పరిశోధనా రంగాల్లో భారతీయ, అంతర్జాతీయ పరిశోధకులకు విస్తృత అవకాశాలను అందించడానికి ఇది తోడ్పడుతుంది.

నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ నుంచి భారత్‌లోని అయోధ్యకు వారాంతపు రైలు సర్వీసుకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూఢిల్లీ, నవంబర్ 16:భారత్-నేపాల్ మధ్య రైలు అనుసంధానాన్ని బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. నేపాల్‌లోని జనక్‌పూర్‌ధామ్, భారత్‌లోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య మధ్య కొత్త వారాంతపు రైలు సర్వీసును ప్రవేశపెట్టేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది.

-రామాయణ సంప్రదాయంతో గాఢమైన అనుబంధం కలిగిన రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఈ రైలు సర్వీసు కీలక అనుసంధానంగా నిలవనుంది. సీతామాత జన్మస్థలంగా పూజలందుకుంటున్న జనక్‌పూర్‌ధామ్, ప్రభు శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్య మధ్య రైలు ప్రయాణ సదుపాయం కల్పించనుంది. ఈ చొరవతో ఇరు దేశాల ప్రయాణికులకు ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాలకు చేరుకోవడం మరింత సులభం కానుంది. అదే సమయంలో ఉమ్మడి నాగరికతా వారసత్వం మరింత బలోపేతం కానుంది.

సుమారు 604 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ వారాంతపు రైలు సర్వీసు.. బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ముఖ్య పట్టణాలు, నగరాల మీదుగా జనక్‌పూర్‌ధామ్‌ను అయోధ్య కంటోన్మెంట్ రైల్వే స్టేషన్‌ను అనుసంధానించనుంది.

ఈ రైలుకు ప్రారంభ, చివరి స్టేషన్లతో పాటు జయనగర్, మధుబని, శివోహ్, సీతామఢి, రక్సౌల్, నర్కటియాగంజ్, గోరఖ్‌పూర్, బస్తీ, మనక్‌పూర్, అయోధ్యధామ్ స్టేషన్లలో వాణిజ్యపరమైన హాల్టులు ఉంటాయి.

ఈ రైలు వారానికి ఒకసారి నడుస్తుంది. జనక్‌పూర్‌ధామ్ నుంచి ప్రతి శనివారం, అయోధ్య కంటోన్మెంట్ నుంచి ప్రతి సోమవారం బయలుదేరుతుంది. కొత్త రైలు సర్వీసుతో యాత్రికులు, పర్యాటకులు, ఇతర ప్రయాణికులకు సరిహద్దులు దాటి ప్రయాణించడం మరింత సౌకర్యవంతం కానుంది. జనక్‌పూర్, అయోధ్య మధ్య ఆధ్యాత్మిక యాత్రలకు ఇది దోహదపడుతుంది. రామాయణంతో ముడిపడిన పర్యాటక మార్గాల అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు విద్య, వ్యాపారం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణించే వారికి మెరుగైన రవాణా సదుపాయం కల్పిస్తుంది.

ఇటలీలో ప్రవాస భారతీయులతో కలసి ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: కేంద్ర శాస్త్రవిజ్ఞాన-సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఇవాళ ఇటలీ రాజధాని రోమ్ నగరంలో ప్రవాస భారతీయులతో కలసి ప్రపంచ మధుమేహ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భారతీయులు, విద్యార్థులు, మహిళలు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు విభిన్న సామాజిక వర్గాలవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన శాస్త్ర-సాంకేతిక పరిశోధన, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో భారత్ సాధించిన అద్భుత ప్రగతిని మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. భారత శాస్త్రవిజ్ఞాన సామర్థ్యం, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, ప్రపంచ శాస్త్రవిజ్ఞాన ప్రగతికి భారత్ విస్తృత సహకారంపై దేశంలో ఇనుమడిస్తున్న విశ్వాసం ఈ కార్యక్రమంలో ప్రతిబింబించింది.

భారత శాస్త్రవిజ్ఞాన, ఆరోగ్య సంరక్షణ రంగాలు శరవేగంగా పురోగమించడంపై కార్యక్రమంలో పాల్గొన్న ప్రవాస భారతీయులు సహా ప్రతి ఒక్కరిలో ఎంతో ఆసక్తి వ్యక్తమైంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో శాస్త్రవిజ్ఞాన పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, ఆరోగ్య సంరక్షణ సేవల ప్రదానంలో దేశం సాధించిన పురోగతిని వారందరూ ప్రశంసించారు. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ నానాటికీ పెరుగుతుండటం సహా మధుమేహం వంటి కీలక ప్రజారోగ్య సవాళ్ల పరిష్కారంలో ప్రభుత్వ నిబద్ధతపై తాము గర్విస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు పేర్కొన్నారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా రోమ్‌లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రముఖ మధుమేహ చికిత్స నిపుణుడైన ప్రొఫెసర్ డాక్టర్ శ్రీ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి నిర్వహణ భారం పెరుగుదలను నివారించేందుకు అనుసరించాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ మేరకు జీవనశైలి మార్పులు, ఆరోగ్యకర ఆహారపుటలవాట్లు, శారీరక శ్రమ, ఊబకాయ నియంత్రణ ప్రాథమికంగా అత్యావశ్యకమని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతరంలో మధుమేహ నివారణపై ప్రతి ఒక్కరూ మరింతగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

మధుమేహం రెండో రకం (డయాబెటిస్ మెలిటస్) చికిత్సలో అనేక కొత్త రకాల మందులు అందుబాటులోకి వచ్చినా, జీవనశైలి మార్పులు, ఊబకాయ నియంత్రణే దీని నివారణకు ప్రాథమిక మంత్రమని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్ఫుటం చేశారు.

'మధుమేహంపై సత్వర కార్యాచరణ' నినాదాన్ని ఈ ఏడాది ప్రపంచ మధుమేహ దినోత్సవ ఇతివృత్తంగా నిర్ణయించడాన్ని ఆయన ప్రస్తావించారు. సమాజంలో మధుమేహ వ్యాప్తి వేగాన్ని అరికట్టేందుకు అవసరమైన నిర్వహణ వ్యూహాల సంపూర్ణ స్ఫూర్తిని ఈ నినాదం ప్రతిబింబిస్తుందని మంత్రి వివరించారు. మధుమేహ నిర్వహణ భారం పెరుగుదలను తగ్గించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో వ్యాధి ముందస్తు గుర్తింపు, సకాలంలో చర్యలు చేపట్టడం, అనంతరం ఔషధ-ఔషధేతర చర్యలతో రక్తంలో గ్లూకోజ్ స్థాయి కఠిన నియంత్రణ ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.

మధుమేహం బారినపడే వారి వయస్సు తీరులో మార్పుపై డాక్టర్ జితేంద్ర సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. లోగడ మధ్య వయస్కులు, వృద్ధులతో ఈ వ్యాధి ఎక్కువగా ముడిపడి ఉండేదని ఆయన పేర్కొన్నారు. అయితే, ఇప్పుడు జీవితంలో అత్యంత కీలకమైన యవ్వన దశలోనే యువతపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటోందని ఆయన తెలిపారు. చిన్న వయస్సులోనే మధుమేహం బారినపడటం వ్యక్తిలో వృత్తిపరమైన ఉత్పాదకత, జీవన నాణ్యతలపై దుష్ప్రభావం చూపుతుందని చెప్పారు. దీని బారినపడిన తర్వాత మూత్ర పిండాలు, కళ్లు, గుండె వంటి కీలక అవయవాలకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ ప్రమాదాన్ని నిరోధించాలంటే సుదీర్ఘకాలం పాటు రక్తంలో గ్లూకోజ్ నియంత్రణపై నిరంతర శ్రద్ధ అవశ్యమని స్పష్టం చేశారు.

ఊబకాయం, మధుమేహం, డిస్లిపిడెమియా, అధిక రక్తపోటు, గుండె జబ్బుల మధ్య సన్నిహిత జీవక్రియా సంబంధాన్ని మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. అవినాభావ సంబంధంగల ఈ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా బాలల్లో ఊబకాయ నివారణ-నియంత్రణ అవసరాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పదేపదే ప్రస్ఫుటం చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు.

మధుమేహం సహా జీవక్రియా సంబంధ రుగ్మతలకు ఒక స్వతంత్ర ప్రమాద కారకం స్థూలకాయమని, ప్రత్యేకించి భారతీయులు దీనిబారిన పడే అవకాశాలు అధికమని మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలో నివారణపరమైన ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేస్తూ, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించాలని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

జీవక్రియ సంబంధ రుగ్మతలు, జీవనశైలి సంబంధ వ్యాధుల నిర్వహణ కోసం 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సమగ్ర-సంపూర్ణ విధానాన్ని కూడా మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి ఏకగ్రీవంగా ఆమోదించిన ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు గురించి గుర్తు చేశారు.

అలాగే, ఆరోగ్య శ్రేయో కేంద్రాల ఏర్పాటు, ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ వంటి కార్యక్రమాలను కూడా ఆయన ప్రస్తావించారు. సమాజంలో మధుమేహ భారం తగ్గించడంలో ఇవన్నీ వివిధ రకాలుగా తోడ్పడతాయని ఆయన అన్నారు.

మధుమేహం కోసం సామూహిక స్క్రీనింగ్ ఏర్పాట్లు, ఆరోగ్య సంరక్షణను మరింత అందుబాటులోకి తేవడం, ఆయుష్మాన్ భారత్ కింద ఉన్నత చికిత్స అందుబాటు వంటి కార్యక్రమాలను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. ముఖ్యంగా వ్యాధి ముందస్తు గుర్తింపు, చికిత్స అందుబాటును మరింత బలోపేతం చేసే లక్ష్యంతో తీసుకున్న చర్యలను కూడా ఆయన వివరించారు.

ఆహార క్రమశిక్షణ, శారీరక శ్రమ ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ, మధుమేహ నివారణ-నిర్వహణలో ఇవి అత్యావశ్యక అంశాలని మంత్రి అన్నారు. శారీరక, మానసిక ఒత్తిడి కూడా శ్రద్ధ వహించాల్సిన దోహదకారక అంశాలని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లో మధుమేహంతో జీవించే వారి సంఖ్య అధికంగా ఉన్నందువల్ల ఈ వ్యాధి నిర్వహణలో దేశానికి గణనీయ అనుభవం ఉందని మంత్రి పేర్కొన్నారు. భారతీయ నిపుణులు తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని ఇతర దేశాల నిపుణులతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. అలాగే, ఈ సవాలును ఎదుర్కోవడంలో విస్తృత అంతర్జాతీయ కృషికి తోడ్పడగల స్థితిలో వారంతా ఉన్నారని తెలిపారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవ సందేశం కేవలం చికిత్సకు మాత్రమే పరిమితం కాదని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ముఖ్యంగా యువతలో వ్యాధి నివారణ, ముందస్తు నిర్ధారణ, నిరంతర నిర్వహణపై మరింతగా దృష్టి సారించాలని పునరుద్ఘాటించారు.

ఇటలీలో ఈ నెల 11 నుంచి 15 వరకూ మంత్రి అధికార పర్యటనలో భాగంగా రోమ్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటలీలోని భారతీయ సమాజ సభ్యులతోనూ ఆయన ముచ్చటించారు.

విభజనకు గురైన మాతృభూమిలో ఒక భావోద్వేగ ప్రయాణం

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: కొన్ని ప్రయాణాలు భౌగోళిక సరిహద్దులను దాటి సాగితే? మరికొన్ని జ్ఞాపకాలు, అస్తిత్వం, ఆత్మీయ అనుబంధాల లోతుల్లోకి సాగుతాయి. చరిత్రను, అత్యంత వ్యక్తిగతమైన మానవ సంబంధాలను మేళవించి ప్రముఖ పోలిష్ దర్శకుడు పావెల్ పాల్లి కోవ్‌స్కీ రూపొందించిన 'ఫాదర్ ల్యాండ్' చిత్రం 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి (ఐఎఫ్ఎఫ్ఐ) ప్రారంభ చిత్రంగా ఎంపికైంది. గోవాలో తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ప్రపంచ సినిమా వేడుకలకు ఈ చిత్రం ఒక చక్కని ఆరంభాన్ని ఇవ్వనుంది. ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న 1949 వేసవి కాలం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ జర్మన్ రచయిత థామస్ మాన్, ఆయన కుమార్తె ఎరికా (నటి, రచయిత్రి, ర్యాలీ డ్రైవర్) మధ్య అనుబంధాన్ని 'ఫాదర్‌ల్యాండ్' ఆవిష్కరిస్తుంది. అమెరికాలో పదహారేళ్ల ప్రవాస జీవితం తర్వాత తిరిగి జర్మనీకి వచ్చిన థామస్ మాన్, తన కుమార్తెతో కలిసి ఒక నల్లటి బ్యూక్ కారులో సాహసోపేతమైన రోడ్ ట్రిప్‌కు బయలుదేరుతారు. యుద్ధం వల్ల ఛిన్నాభిన్నమైన జర్మనీ గుండా సాగే వీరి ప్రయాణం... అమెరికా ఆధీనంలో ఉన్న ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి సోవియట్ నియంత్రణలో ఉన్న వీమర్ వరకు కొనసాగుతుంది. విడిపోయిన జర్మనీ గుండా సాగే ఈ తండ్రీకూతుళ్ల ప్రయాణంలో... యుద్ధం మిగిల్చిన బాహ్య గాయాల కంటే లోతైన విషయాలనూ వారు ఎదుర్కొంటారు. ఈ ప్రయాణం వారి సొంత కుటుంబంలోని అంతర్గత విభేదాలను, అగాధాలనూ వారి కళ్ళముందు ఉంచుతుంది. భావోద్వేగాలతో నిండిన ఈ కథనం ద్వారా... వ్యక్తిగత అనుబంధాలు, చరిత్ర, 'ఇల్లు' (మాతృభూమి) అనే భావనల మధ్య గల సున్నితమైన సంబంధాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

సాండ్రా హుల్లర్, హాన్స్ జిష్లర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ 82 నిమిషాల డ్రామా చిత్రం పోలండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దుకుంది. పూర్తిగా బ్లాక్ అండ్ వైట్ ఫార్మాట్‌లో తెరకెక్కిన ఈ చిత్రం... 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం వేదికగా తొలిసారిగా భారతీయ ప్రేక్షకుల ముందుకు రానుంది.

యూరోపియన్ చరిత్రలోని ఒక కీలక ఘట్టం నేపథ్యంలో... చరిత్రను, మానవ సంబంధాలను అత్యంత ఆత్మీయంగా ఆవిష్కరించే దర్శకుడు పావెల్ పాల్లికోవ్‌స్కీ శైలికి 'ఫాదర్‌ల్యాండ్' ఒక కొనసాగింపు. ఈ చిత్రాన్ని ఇప్పటికే 2026లో జరిగిన కేన్స్, శాన్ సెబాస్టియన్, టెల్యురైడ్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శించారు.

సైక్లింగ్ క్రీడలతోనే బంగారు భవిష్యత్తు



రాజన్న సిరిసిల్ల,నవంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్ క్రీడకు మంచి గుర్తింపు ఉందని? సైక్లింగ్ క్రీడలతో బంగారు భవిష్యత్తు ఏర్పడుతోందని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ వెలోడ్రాం లో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ (సౌత్ ఇండియా జోన్) క్రీడా పోటీల ప్రారంభం అయ్యాయి.

ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సైక్లింగ్ టీం పాల్గొని ప్రశంసలు అందుకుంది. కరీంనగర్ టీం ను ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అభినందించారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారతీయ రైల్వేలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ శాఖల తోపాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో స్పోర్ట్స్ కోటా కింద నేరుగా ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

సైక్లింగ్ కు సంబంధించిన రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ఉన్నత విద్యా కోర్సులలో ప్రత్యేక స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్ కాంతారావు, సైక్లింగ్ కోచ్ చంద్రారెడ్డి, మ్యాక్స్ వెల్ పెద్దపెల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అసంపల్లి శ్రీనివాస్, సెక్రటరీ తగరపు శంకర్, కరీంనగర్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సురభి వేణుగోపాల్, సుల్తానాబాద్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతే వార్తకు ప్రాణం.. మీడియాతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది

- స్విమ్స్ డైరెక్టర్ కం వీసీ డాక్టర్ జి. జగదీష్

తిరుపతి, నవంబర్ 16: ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తున్న మీడియా ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని స్విమ్స్ డైరెక్టర్ కం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. జగదీష్ పేర్కొన్నారు. మీడియా పుకార్లకు, ఊహాగానాలకు చోటివ్వకుండా కేవలం వాస్తవాలకే ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మీడియా తన బాధ్యతను సక్రమంగా నిర్వహించకపోతే తప్పుడు సమాచారం వల్ల ఎందరో ప్రాణాలకు సైతం నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పత్రికా స్వేచ్ఛ జర్నలిస్టులకే ఉండాలని, యజమానులకు కాదని స్పష్టం చేశారు.

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏపీ వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి డాక్టర్ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మీడియా బాధ్యతలు, జర్నలిజంలో విశ్వసనీయత ప్రాధాన్యతను వివరించారు.

బర్డ్స్‌లో గత ఏడాది కాలంగా, అలాగే స్విమ్స్‌లో తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గతంలో జరిగిన నష్టాలను సరిదిద్దే పనిలో నిమగ్నమైనట్లు తెలిపారు. ప్రాణదానం ట్రస్టు ద్వారా పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఆసియాలోనే అత్యంత ఆధునిక వైద్య పరికరాలు, ప్రయోగశాలలు కలిగిన స్విమ్స్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

టీటీడీ ఉద్యోగులు, ప్రత్యేక ప్రతిభావంతులతో పాటు జర్నలిస్టుల కోసం కూడా వైద్య సేవలు పొందేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్విమ్స్ ప్రధాన ద్వారం వద్ద నుంచి రోగులు సంబంధిత వైద్య సేవలు పొందే ప్రాంతాల వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం స్విమ్స్‌ను ఆశ్రయించే వారికి పడకలు లేవని వెనక్కి పంపించే పరిస్థితి ఇకపై ఉండదని స్పష్టం చేశారు.

ఎస్వీ యూనివర్సిటీ న్యాయ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ జి. ఆదినారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పత్రికలు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగినప్పటికీ, అందులో వాస్తవాలకు దూరంగా ఉన్న సమాచారం ఎక్కువగా కనిపిస్తోందని అన్నారు. ప్రజల్లో విశ్వసనీయతను పెంపొందించడంతో పాటు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మీడియా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ తప్పొప్పులను సైతం ఎత్తిచూపి సరిదిద్దే గొప్ప బాధ్యతను మీడియా నిర్వర్తించాలని కోరారు.

సీనియర్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ టి. జనార్దన్ మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. తద్వారా జర్నలిస్టులకు రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ నగేష్ మాట్లాడుతూ జర్నలిజం వ్యాపార దృక్పథంతో కాకుండా వాస్తవాల ఆధారంగా పనిచేయాలని అన్నారు. రాజకీయ పార్టీల మనుగడ కోసం, సంపాదన కోసం కాకుండా స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో జర్నలిస్టులు విధులు నిర్వహించాలని సూచించారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ డిజిటల్ మీడియా విశ్వవ్యాప్తమవుతున్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలకు భిన్నమైన సమాచారం ప్రజలకు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి. శ్రీధర్ మాట్లాడుతూ మీడియా పట్ల సమాజంలో చులకన భావం పెరుగుతోందని అన్నారు. కేవలం సోషల్ మీడియాపైనే దృష్టి కేంద్రీకరించడం తగదని పేర్కొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఉచిత సహాయక ఉపకరణాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం..

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, నవంబర్ 16: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సైదాపూర్ మండల కేంద్రంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచిత సహాయక ఉపకరణాలు అందించేందుకు అలింకో సంస్థ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు ఉచితంగా సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు.

ఈ శిబిరాల్లో అర్హులను గుర్తించి కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు, చంక కర్రలు, చేతి కర్రలు, వీల్‌చైర్లు, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు అందజేస్తామని వెల్లడించారు. నవంబర్ 16న సైదాపూర్‌లో ప్రారంభమైన శిబిరాలు 17న ఎల్కతుర్తి, 18న భీమదేవరపల్లి, 20న కోహెడ, 21న చిగురుమామిడి మండలాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్ 25, 26, 27 తేదీల్లో హుస్నాబాద్ మండలంతో పాటు పట్టణంలో, అనంతరం అక్కన్నపేట మండలంలోనూ శిబిరాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

నియోజకవర్గంలో అర్హులైన ఒక్క దివ్యాంగుడు, వృద్ధుడు కూడా సహాయక ఉపకరణాలు అందకుండా మిగిలిపోకూడదన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని అర్హులను గుర్తించి శిబిరాలకు తీసుకురావాలని సూచించారు.

వైద్య పరీక్షల అనంతరం వారిని తిరిగి గ్రామాలకు చేర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. పెన్షన్లు ఇప్పిస్తామని డబ్బులు అడిగే దళారులను నమ్మవద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

కరీంనగర్, నవంబర్ 16: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అండగా నిలిచారు.

జగిత్యాల పట్టణం 2వ వార్డుకు చెందిన రామగిరి మమత మెదడు సమస్యతో బాధపడుతూ ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతుండగా విషయాన్ని స్థానిక కౌన్సిలర్ దయాల చంద్రకళ శంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయాల శంకర్, సర్పంచులు ఆకుల మల్లేశం, నక్క హరీష్, ఆకుల తిరుపతి, రాజన్న గౌడ్, తోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానం
అక్షరయాన్, అభిజ్ఞ భారత్ &
కోడూరి లీలావతిదేవి, పద్మిని మెమోరియల్ ఫౌండేషన్
సంయుక్త నిర్వహణలో
బహుముఖ ప్రజ్ఞాశాలి
కోడూరి లీలావతి దేవి గారి
శత జయంతోత్సవం
& వారి చివరి చారిత్రక నవల 'జయ విపంచి' ఆవిష్కరణ
21 నవంబర్, 2026 (శనివారం) ఉదయం 10:00 గం.లకు
తెలంగాణ ప్రెస్ అకాడమి, నాంపల్లి, హైదరాబాద్
జయవిపంచి
అతిథులు
ముఖ్య అతిథి : శ్రీ సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత
విశిష్ట అతిథి & పుస్తక ఆవిష్కర్త : డా॥ వెలుదండ నిత్యానంద రావు ఉపాధ్యక్షులు, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాస్, సంపాదకులు, 'నేటి నిజం' పత్రిక
ఆత్మీయ అతిథి : విమలక్క (అరుణోదయ)
సభాధ్యక్షులు : డా॥ మామిడి హరికృష్ణ, జాయింట్ సెక్రటరి, MJPREIS, తెలంగాణ
5 రంగాల్లో కోడూరి లీలావతి విశిష్ట మహిళా పురస్కారాలు
వైద్య రంగం
సామాజిక సేవా రంగం
ఆధ్యాత్మిక రంగం
సాహిత్య రంగం
సంగీత రంగం
డా. చిరంజీవి
డా. మమతా రఘువీర్
డా. నాగేశ్వరి
చివుకుల శ్రీలక్ష్మి
శ్రీమతి సుబ్బలక్ష్మి కట్టమూరి
(P.T.O.)
బాల ప్రతిభా పురస్కారాల ప్రదానం
లంకెల గోకులచంద్ర (వాద్యసంగీతం) హైదరాబాద్
శ్రీ సాయి రాహుల్ (గ్రాఫ్లింగ్), గురు దత్త పాఠశాల, హైదరాబాద్
హర్షవర్ధన్ (గ్రాఫ్లింగ్) గురు దత్త పాఠశాల, హైదరాబాద్
కోడూరు శ్రీకృష్ణ కౌశల్ (నటన) హైదరాబాద్
దండబోయిన అమోఘకృతి (వ్యాఖ్యాన రంగం) హైదరాబాద్
జాహ్నవి బైరు (చిత్రలేఖనం) హైదరాబాద్
పర్సకుర్తి రిషిక (పద్య కవయత్రి) సిరిసిల్ల
సాగర్ల శ్రీవర్ధన్ (కథా రచయిత) హైదరాబాద్
ఇంగువ కామేశ్వరి (పద్య ధారణ) హైదరాబాద్
నిర్వహణ: ఘాలి లలితా ప్రవల్లిక
1000 కథల్ని తన గళంలో పండించిన 'గళా'కారులు వెంపటి కామేశ్వరరావు గారికి చిరు సత్కారం
మహిళా కవి సమ్మేళనం
చివుకుల శ్రీలక్ష్మి గారి నవల ఆవిష్కరణ
వ్యాఖ్యానం: డా॥ సమ్మెట విజయ, విశ్వైక
ఆహ్వానించుకొరు
అయినంపూడి శ్రీలక్ష్మి
డా. దుంపా శ్రీదేవి
కోడూరి శ్రీధర్

అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకం

ఏసీబీపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం
ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతాం
ఏసీబీ కార్యాలయా భావనం మార్పు
ప్రారంభించిన డీఎస్పీ వై. రమేష్



ఖమ్మం, నవంబర్ 16: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు ప్రజలు చైతన్యవంతులై ఏసీబీకి సహకరించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ వై. రమేష్ పిలుపునిచ్చారు. అవినీతికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు నిర్భయంగా ముందుకు వచ్చి ఏసీబీకి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ఖమ్మంలోని విడోస్ కాలనీలో కొనసాగుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ కార్యాలయాన్ని పాత మున్సిపల్ కార్యాలయ భవనంలోకి మారుస్తూ ఆదివారం నూతన కార్యాలయాన్ని డీఎస్పీ వై. రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీబీ కార్యకలాపాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతి కార్యకలాపాలకు పాల్పడినా ప్రజలు ఏమాత్రం భయపడకుండా ఏసీబీకి సమాచారం అందించాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అవినీతి రహిత పాలన సాధనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అవినీతి నిర్మూలనకు తమ వంతు పాత్ర పోషించాలని డీఎస్పీ వై. రమేష్ విజ్ఞప్తి చేశారు.

మలేషియా వెళ్లి జైల్లో చిక్కుకున్న తాడ్వాయి యువకుడు

నిజామాబాద్, నవంబర్ 16: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మించి అమాయకులను మోసం చేస్తున్న ఏజెంట్ల ఆగడాలకు మరో కుటుంబం బలైంది. మలేషియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి తాడ్వాయి గ్రామానికి చెందిన అజ్జపల్లి సురేష్‌ను విదేశాలకు పంపించిన ఏజెంట్, ప్రస్తుతం అతడు అక్కడ జైల్లో చిక్కుకోవడంతో కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. భర్త ఎక్కడ ఉన్నాడో తెలియక, ఇద్దరు ఆడపిల్లలతో భార్య మౌనిక కన్నీరుమున్నీరవుతోంది.

మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. మూడేగామ గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తి మలేషియాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి జూన్ 4వ తారీఖున మలేషియా పంపించడానికి సురేష్ వద్ద నుంచి రూ.1.40 లక్షలు తీసుకున్నాడు. ఈ క్రమంలో జూన్ 4న కంపెనీ విసా అని చెప్పి,టూరిస్ట్ వీసాపై మలేషియాకు పంపించాడు. అక్కడికి వెళ్లిన అనంతరం జులై 6వ తారీఖున మలేషియా పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకుని జైలులో ఉంచినట్లు భార్య మౌనిక వెల్లడించింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సురేష్ తెలియజేయడంతో భార్య మౌనిక ఏజెంట్ సంతోష్‌ను సంప్రదించింది. అక్కడ తనకు పరిచయస్తుడైన శ్యామ్‌రాజ్ ఉన్నాడని, అతడు నీ భర్త సురేష్‌ను విడిపిస్తాడని చెప్పినట్లు తెలిపింది.అనంతరం కామారెడ్డికి పట్టణానికి చెందిన శ్యామ్‌రాజ్‌ను సంప్రదించగా రూ.లక్ష ఇస్తే జైలు నుంచి విడిపిస్తానని చెప్పడంతో ఆ మొత్తాన్ని పంపించినట్లు పేర్కొంది.అయితే డబ్బులు తీసుకున్న తర్వాత మరో రూ.70 వేలు ఇస్తేనే సురేష్‌ను బయటకు తీసుకొస్తానని చెప్పడంతో అప్పులు చేసి, బంగారం కుదువపెట్టి ఆ మొత్తాన్ని కూడా చెల్లించినట్లు మౌనిక ఆవేదన వ్యక్తం చేసింది. మొత్తం డబ్బులు చెల్లించినప్పటికీ తన భర్తను విడిపించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తన కుటుంబాన్ని మోసం చేస్తున్నాడని ఆరోపించింది.

ఈ వ్యవహారంపై తాడువాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు మౌలిక తెలిపింది. పోలీసులు సైతం సంబంధిత వ్యక్తితో మాట్లాడి న్యాయం చేయాలని సూచించినప్పటికీ ఫలితం లేకపోవడంతో, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావును ఆశ్రయించినట్లు వెల్లడించింది. ఎమ్మెల్యే స్పందించి తన భర్తను స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. అయితే నాలుగు నెలలు గడుస్తున్న భర్త తిరిగి రాకపోవడం, ఆచూకీ తెలియకపోవడంతో ఎమ్మెల్యే పీఏ పృథ్వీ నీ సంప్రదించినట్లు తెలిపింది. ఆయన మలేషియాలోని మా క్యాంప్ ఆఫీస్ లో సురేష్ ఉన్నాడని తిరిగి ఇంటికి పంపించే ఏర్పాట్లు చేస్తామని చెప్పినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.



విభజనకు గురైన మాతృభూమిలో ఒక భావోద్వేగ ప్రయాణం

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: కొన్ని ప్రయాణాలు భౌగోళిక సరిహద్దులను దాటి సాగితే? మరికొన్ని జ్ఞాపకాలు, అస్తిత్వం, ఆత్మీయ అనుబంధాల లోతుల్లోకి సాగుతాయి. చరిత్రను, అత్యంత వ్యక్తిగత మైన మానవ సంబంధాలను మేళవించి ప్రముఖ పోలిష్ దర్శకుడు పావెల్ పావ్లి కోవ్‌స్కీ రూపొందించిన 'ఫాదర్‌ల్యాండ్' చిత్రం 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి (ఐఎఫ్ఎఫ్ఐ) ప్రారంభ చిత్రంగా ఎంపికైంది. గోవాలో తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ప్రపంచ సినిమా వేడుకలకు ఈ చిత్రం ఒక చక్కని ఆరంభాన్ని ఇవ్వనుంది.

ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న 1949 వేసవి కాలం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ జర్మన్ రచయిత థామస్ మాన్, ఆయన కుమార్తె ఎరికా (నటి, రచయిత్రి, ర్యాలీ డ్రైవర్) మధ్య అనుబంధాన్ని 'ఫాదర్‌ల్యాండ్' ఆవిష్కరిస్తుంది. అమెరికాలో పదహారేళ్ల ప్రవాస జీవితం తర్వాత తిరిగి జర్మనీకి వచ్చిన థామస్ మాన్, తన కుమార్తెతో కలిసి ఒక నల్లటి బ్యూక్ కారులో సాహసోపేతమైన రోడ్ ట్రిప్‌కు బయలుదేరుతారు. యుద్ధం వల్ల ఛిన్నాభిన్నమైన జర్మనీ గుండా సాగే వీరి ప్రయాణం... అమెరికా ఆధీనంలో ఉన్న ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి సోవియట్ నియంత్రణలో ఉన్న వీమర్ వరకు కొనసాగుతుంది.

విడిపోయిన జర్మనీ గుండా సాగే ఈ తండ్రీకూతుళ్ల ప్రయాణంలో... యుద్ధం మిగిల్చిన బాహ్య గాయాల కంటే లోతైన విషయాలనూ వారు ఎదుర్కొంటారు. ఈ ప్రయాణం వారి సొంత కుటుంబంలోని అంతర్గత విభేదాలను, అగాధాలనూ వారి కళ్ళముందు ఉంచుతుంది. భావోద్వేగాలతో నిండిన ఈ కథనం ద్వారా... వ్యక్తిగత అనుబంధాలు, చరిత్ర, 'ఇల్లు' (మాతృభూమి) అనే భావనల మధ్య గల సున్నితమైన సంబంధాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

సాండ్రా హుల్లర్, హాన్స్ జిష్లర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ 82 నిమిషాల డ్రామా చిత్రం పోలండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల సంయుక్త నిర్మాణంలో రూపుదిద్దుకుంది. పూర్తిగా బ్లాక్ అండ్ వైట్ ఫార్మాట్‌లో తెరకెక్కిన ఈ చిత్రం... 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం వేదికగా తొలిసారిగా భారతీయ ప్రేక్షకుల ముందుకు రానుంది.

యూరోపియన్ చరిత్రలోని ఒక కీలక ఘట్టం నేపథ్యంలో... చరిత్రను, మానవ సంబంధాలను అత్యంత ఆత్మీయంగా ఆవిష్కరించే దర్శకుడు పావెల్ పావ్లికోవ్‌స్కీ శైలికి 'ఫాదర్‌ల్యాండ్' ఒక కొనసాగింపు. ఈ చిత్రాన్ని ఇప్పటికే 2026లో జరిగిన కేన్స్, శాన్ సెబాస్టియన్, టెల్యూరైడ్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. ఈ చిత్రం విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంది. కేన్స్ చిత్రోత్సవంలో పావ్లికోవ్‌స్కీకి 'ఉత్తమ దర్శకుడు' పురస్కారాన్ని అందించింది.

'ఫాదర్‌ల్యాండ్' చిత్రంతో 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం... భౌగోళిక, సాంస్కృతిక సరిహద్దులకు అతీతమైన కథల ప్రయాణానికి శ్రీకారం చుట్టనుంది. విభిన్న ప్రపంచాలను, దృక్పథాలను సినిమా ఒకే వేదికపైకి తీసుకువస్తున్న తరుణంలో... 'సరిహద్దులకు అతీతమైన కథలు' అనే ఇతివృత్తంతో సాగనున్న ఈ ఏడాది చిత్రోత్సవానికి ఈ ప్రారంభ చిత్రం ఒక అత్యంత సముచితమైన ఆరంభాన్ని అందిస్తుంది.

'ఐ మ్యాటర్': ఇఫి-2026లో మిడ్-ఫెస్ట్ సినిమాగా ప్రదర్శించే ఈ చిత్రంగుర్తింపు, అనుబంధం, మరో అవకాశంతో కూడిన శక్తిమంతమైన కథాంశం

న్యూఢిల్లీ, నవంబర్ 16:ప్రఖ్యాత సినీరూపకర్త అలీనా షెర్బాన్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన బహుభాషా నాటక చిత్రం ఐ మ్యాటర్. 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫి)లో మిడ్-ఫెస్ట్ చిత్రంగా దీన్ని ప్రదర్శిస్తారు. రొమేనియా, జర్మనీ, బెల్జియం దేశాలు కలిసి రూపొందించిన 101 నిమిషాల ఈ చిత్రం... గుర్తింపు, కుటుంబం, అనుబంధం, గతం తాలూకు పరిస్థితులను అధిగమించి ఉజ్వల భవిష్యత్తును వెతుక్కోవటం వంటి అంశాలను వివరిస్తుంది. రొమేనియన్, రోమానీ భాషల్లో సంభాషణలున్న ఈ సినిమా... ఈ ఫెస్టివల్‌కు విలక్షణమైన యూరోపియన్ చలనచిత్ర దృక్పథాన్ని తీసుకువస్తుంది.

అనాథాశ్రమాన్ని విడేందుకు సిద్ధమవుతున్న రోమా యువతి రెబెకా కథ ఇది. ఆమె తండ్రి జైలు నుంచి విడుదల కానుండటంతో తను ఎప్పుడూ కోరుకున్న కుటుంబాన్ని కనుక్కొని, జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలని ఆశిస్తుంది. నటనలో పైచదువుల కోసం విశ్వవిద్యాలయంలో ప్రవేశం లభించటంతో ఆమెలో కొత్త ఆశలు చిగురిస్తాయి. భవిష్యత్తును తానే తీర్చిదిద్దుకునే అవకాశం వస్తుంది. అయితే తనకు పరిచయం లేని కొత్త ప్రపంచంలో అడుగుపెడుతున్న తరుణంలో గతంలోని చేదు అనుభవాలు మళ్లీ ఎదురై ఆమె కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

స్థిరమైన కుటుంబ వాతావరణం లేకుండా పెరిగే పిల్లల భావోద్వేగ సవాళ్లను, గుర్తింపు కోసం చేసే అన్వేషణను, సమాజంలో తనకంటూ స్థానాన్ని సంపాదించుకోవాలనే సంకల్పాన్ని రెబెకా ప్రయాణం ద్వారా 'ఐ మ్యాటర్' చిత్రం వివరిస్తుంది. ఒక రోమా యువతి జీవితానుభవాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం... సామాజిక భాగస్వామ్యం, ఆత్మగౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలను చర్చిస్తుంది.

ఈ చిత్రం ద్వారా ప్రముఖ నటి, నాటక రచయిత్రి అలీనా షెర్బాన్ తొలిసారిగా ఫీచర్ ఫిల్మ్‌కు దర్శకురాలిగా వ్యవహరించారు. బుకారెస్ట్‌లోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ థియేటర్ అండ్ ఫిలిం నుంచి పట్టభద్రురాలైన ఆమె... న్యూయార్క్ యూనివర్సిటీలోని టిస్చ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమాటిక్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందారు. ఆమె తీసిన గత చిత్రాల్లో కేన్స్ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించిన 'అలోన్ ఎట్ మై వెడ్డింగ్', పలు 'ఉత్తమ నటి' పురస్కారాలు పొందిన 'జిప్సీ క్వీన్' ఉన్నాయి. వెనిస్ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించిన 'హౌస్‌కీపింగ్ ఫర్ బిగినర్స్' చిత్రంలోనూ ఆమె నటించారు.

సెప్టెంబరు 2026లో జరిగిన 83వ వెనిస్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలోని 'వెనిస్ స్పాట్‌లైట్' విభాగంలో ప్రదర్శించిన 'ఐ మ్యాటర్' చిత్రం... ప్రతిష్ఠాత్మక 'అర్మానీ బ్యూటీ ఆడియెన్స్ అవార్డు'ను సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో రెబెకా పాత్రలో దేనిసా ఫర్కాస్ నటించగా, సోరిన్ మిహాయ్, ఏంజెలీనా పావెల్, వనేసా డాన్సియా, రైసా మిహాయ్, అలెగ్జాండ్రు స్టాన్‌కు, అలీనా బెర్జున్‌టియాను, నటాలియా కాలిన్ తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు.

ఇఫి-2026లో 'మిడ్-ఫెస్ట్' ప్రదర్శనగా 'ఐ మ్యాటర్' చిత్రాన్ని నవంబరు 24న సాయంత్రం 4:30 గంటలకు పీవీఆర్ ఐనాక్స్ పంజిమ్ (ఆడిటోరియం 1), పీవీఆర్ ఐనాక్స్ పోర్వోరిమ్ (ఆడిటోరియం 1)లో ఒకే సమయంలో ప్రదర్శిస్తారు. ఈ చిత్ర దర్శకురాలు అలీనా షెర్బాన్, ప్రధాన నటి దేనిసా ఫర్కాస్ ప్రత్యేక అతిథులుగా ఈ వేడుకకు హాజరవుతారు. స్క్రీనింగ్ రోజున పీవీఆర్ ఐనాక్స్ పంజిమ్‌లో చిత్ర బృందం కోసం ప్రత్యేకంగా రెడ్-కార్పెట్ వేడుకను నిర్వహిస్తారు.

గోవాలో పలు వేదికలపై నవంబర్ 20 నుంచి 28 వరకు జరగనున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి)లో 86 దేశాల నుంచి 150కి పైగా అంతర్జాతీయ చిత్రాలను ప్రదర్శిస్తారు. వివిధ పోటీ, పోటీయేతర విభాగాలు, ప్రత్యేక ప్యాకేజీలు, గతంలోని ప్రత్యేక చిత్రాల ప్రదర్శనలు, నివాళులు, ఇతివృత్త ప్రదర్శనల ద్వారా వివిధ దేశాలు, భాషలు, శైలికి సంబంధించిన చిత్రాలను ఈ వేదిక ఒకచోట చేర్చుతుంది. ఇది సాంస్కృతిక భాగస్వామ్యం, చలనచిత్ర నైపుణ్యానికి అద్భుతమైన వేదికను అందిస్తుంది.

కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నా

మహబూబ్‌నగర్, నవంబర్ 16 రైతులు వ్యవసాయ కూలీలు కౌలుదారులు లకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్నం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగర్ కర్నూల్ కలెక్టరేట్ వద్ద సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల నరసింహ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తంగా కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పశుగ్రాసం విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని రైతులకు అవసరమయ్యే వాటిని గుర్తించి అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు వ్యవసాయ కూలీలు రైతులు కౌలుదారులు వృత్తిదారులు కు పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం డి ఫయాజ్ కార్యదర్శి వర్గ సభ్యులు కేశవ్ గౌడ్ కృష్ణాజి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బడా భీమ్‌గల్ బాలికల జట్టు విజయం

అండర్-14 టోర్నీలో నిజామాబాద్ జట్టుకు ప్రథమ స్థానం..



నిజామాబాద్, నవంబర్ 16: సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ పాఠశాలకు చెందిన క్రీడాకారిణులు విశేష ప్రతిభ కనబరిచి విజయంలో కీలక పాత్ర పోషించారు. దీంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనూ అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని అన్నారు. సరైన ప్రోత్సాహం, శిక్షణ లభిస్తే రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలోనూ రాణించగలరని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.

గ్రామ సర్పంచ్ విష్ణువర్ధని మాట్లాడుతూ.. బడా భీమ్‌గల్ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి నిజామాబాద్ జిల్లాకు ప్రథమ స్థానం తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలోని క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. బాలికల విజయాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ విజయంపై పాఠశాల హెచ్ఎం కృష్ణస్వామి, సర్పంచ్ విష్ణువర్ధని, ఉపసర్పంచ్ శంకర్‌గౌడ్, వీడీసీ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాగుల గంగమోహన్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారిణులను అభినందించారు.

45వ భారత అంతర్జాతీయ వ్యాపార ప్రదర్శన (ఐఐటీపీఎఫ్)-2026లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల ప్రదర్శన

న్యూఢిల్లీ, నవంబర్ 16:న్యూఢిల్లీలోని భారత మండపంలో ఇండియన్ ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి 27 వరకు జరుగుతున్న 45వ భారత అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (ఐఐటీఎఫ్)-2026లో ప్రధాన ఆరోగ్య కార్యక్రమాలు, కీలక విజయాలు, ప్రజా ఆరోగ్య సంరక్షణ సేవలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ (ఎంఓహెచ్ఎఫ్‌డబ్ల్యూ) ప్రత్యేకంగా ప్రదర్శిస్తోంది.

నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఎం. శ్రీనివాస్ ఈరోజు ఆరోగ్య పెవిలియన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీలా శ్రీవాస్తవ, ఆరోగ్య పరిశోధన శాఖ (డీహెచ్ఆర్) కార్యదర్శి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహెల్ జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శ్రీ సునీల్ కుమార్ బర్న్‌వాల్‌తో పాటు మంత్రిత్వశాఖ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకమైన ఈ వార్షిక వేడుకలో మంత్రిత్వశాఖ భాగస్వామ్యం వహించటంతో పౌరులతో నేరుగా మమేకం అయ్యేందుకు, ప్రభుత్వం చేపట్టిన విస్తృత ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రదర్శించేందుకు, నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, ప్రారంభ దశలోనే వ్యాధి నిర్ధారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కీలక వేదిక లభిస్తుంది.

'యువ భారత్, స్వస్థ భారత్': నివారణతో కూడిన ఆరోగ్య సంరక్షణ సంస్కృతిని ప్రోత్సహించటం

ఈ ఏడాది ఆరోగ్య పెవిలియన్ 'యువ భారత్, స్వస్థ భారత్' ఇతివృత్తంతో ఏర్పాటైంది. నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లకు, ఆరోగ్యకరమైన, మరింత దృఢమైన భారతదేశ నిర్మాణంలో యువత క్రియాశీలక భాగస్వామ్యానికి విశేష ప్రాధాన్యతనిస్తుంది.

చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించటం, ఆరోగ్య అవగాహనను పెంపొందించటం, పౌరులు శారీరక, మానసిక ఆరోగ్యంపై తగిన నిర్ణయాలు తీసుకునేలా శక్తిమంతం చేయటం వంటి అంశాల ప్రాముఖ్యతను ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తుంది.

సమాచార ప్రదర్శనలు, పరస్పరం స్పందించే ప్రదర్శనలు, ప్రజలను భాగస్వామ్యం చేసే కార్యక్రమాల ద్వారా అందరికీ, ముఖ్యంగా యువత, పిల్లలు, కుటుంబాలకు ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉండేలా, సులభంగా అర్థమయ్యేలా, ఆసక్తి కనబరిచేలా తెలియజేయటమే ఈ పెవిలియన్ లక్ష్యం.

అసంక్రమిత వ్యాధులు (ఎన్‌సీడీలు), జీవనశైలికి సంబంధించిన ఆరోగ్య సమస్యల భారం రోజురోజుకూ పెరుగుతున్నట్లు డాక్టర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై మరింత దృష్టి సారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

ఎన్‌సీడీల నివారణలో, వాటి నిర్వహణలో ప్రజల్లో అవగాహన పెంచటం, వ్యాధులను ముందస్తుగా గుర్తించటం, సకాలంలో వైద్య సేవలు పొందటం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు. పౌరుల ఆరోగ్యం పట్ల మరింత బాధ్యత వహించాలని, తగిన సమాచారంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సాధారణంగా వచ్చే ఆరోగ్య ప్రమాదాల గురించి తెలుసుకునేందుకు, నివారణ చర్యలపై అవగాహన తెచ్చుకునేందుకు, వివిధ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, సేవల గురించి తెలుసుకునేందుకు ఆరోగ్య పెవిలియన్ పౌరులకు విలువైన అవకాశాన్ని కల్పిస్తోందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

సందర్శకులు, ముఖ్యంగా యువకులు, కుటుంబాలు పెవిలియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని, ఆరోగ్యం, సంక్షేమంపై అవగాహనను పెంపొందించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రోత్సహించారు.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఒకేచోట 24 ఆరోగ్య కార్యక్రమాలు, సంస్థలు

భారత మండపంలోని నాలుగో హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 989 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 39 స్టాళ్ల ద్వారా ఈ ఆరోగ్య పెవిలియన్ రూపుదిద్దుకుంది. 24 జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రోగ్రామ్ డివిజన్లు, పాల్గొనే సంస్థలకు ఇది వేదికగా నిలిచింది.

ఈ పెవిలియన్ సందర్శకులకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నివారణ, నియంత్రణ, టీకా కార్యక్రమాలు, మాతా శిశు ఆరోగ్యం, డిజిటల్ ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్యం, ఆహార భద్రత, అవయవ దానం, ఇతర ముఖ్యమైన ప్రజారోగ్య రంగాలపై, భారతదేశ ప్రజారోగ్య కార్యక్రమాలపై సమగ్ర అవగాహనను కల్పిస్తుంది.

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 204 మందికి చేయూత పింఛన్లు మంజూరు

-లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.



సంగారెడ్డి నవంబరు 16(నేటి నిజం ప్రతినిధి)నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులో ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో నారాయణఖేడ్ పురపాలక సంఘం పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లాకు అత్యధిక సంఖ్యలో చేయూత పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. అందులోనూ నారాయణఖేడ్ నియోజకవర్గానికి జిల్లాలోనే అత్యధికంగా పింఛన్లు మంజూరు కావడం విశేషమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సూచనలు చేసినట్లు తెలిపారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 204 చేయూత పింఛన్లు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు మంజూరు కాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగులు, నిరుపేదల ఆశలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని వివరించారు.

అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటే వారిని గుర్తించి, అర్హత మేరకు పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సేట్, షారూఖ్ ఖాన్, రుక్మిణి గోపాల్ రెడ్డి, మహేష్ చౌహన్, సురేఖ విఠల్, సుబుర్, మైతాబ్, వివేకానంద, లక్ష్మణ్, పత్రి రామకృష్ణ, విజయ్ బుజ్జి, స్వప్న అభిషేక్ శేట్కర్, మున్సిపల్ కౌన్సిలర్లు, ముంతాజ్ సేట్, శెట్టి శంకర్, మొహీద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు నగేష్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండరి రెడ్డి, సీనియర్ నాయకులు తాహెర్ అలీ, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

57వ ఇఫీలో గౌరవప్రద దేశంగా స్పెయిన్: సమకాలీన స్పానిష్ సినిమా, కథనాల వేడుక

న్యూఢిల్లీ, నవంబర్ 16:57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి (ఇఫీ) హాజరయ్యే సినీ ప్రియులకు ఒక ప్రత్యేక విందు సిద్ధంగా ఉంది. స్పానిష్ సినిమా వైభవాన్ని, వైవిధ్యాన్ని ఈ వేడుక ఘనంగా చాటనుంది. స్పెయిన్‌ను 'కంట్రీ ఆఫ్ ఆనర్'గా ఎంపిక చేయడంతో... ప్రపంచ, ఆసియా, భారత ప్రీమియర్లతో కూడిన నాలుగు సమకాలీన స్పానిష్ చిత్రాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి ఇఫీలో ప్రదర్శించనున్నారు. సమకాలీన స్పానిష్ చిత్రసీమలోని ఉత్సాహాన్ని, సృజనాత్మకతను, మారుతున్న కథన శైలిని ప్రేక్షకులకు ఆకట్టుకునే రీతిలో ఈ ప్రదర్శన పరిచయం చేస్తుంది.

రెండుసార్లు ఆస్కార్ పురస్కారం అందుకున్న ఫిలిం మేకర్ పెడ్రో అల్మోడోవర్ 2026లో రూపొందించిన తాజా చిత్రం ఇది. సినిమా నిర్మాణంలో వ్యక్తిగత అనుభవాలను, వాస్తవ ఘటనలను ఉపయోగించడం వల్ల ఎదురయ్యే సవాళ్లను విశ్లేషిస్తుంది. ఒక నిజాయితీతో కూడిన కథను ఆవిష్కరించే క్రమంలో ఒకరి జీవితాన్ని దర్శకుడు ఎంత వరకు తెరకెక్కించవచ్చనే ప్రశ్నను ఈ సినిమా లేవనెత్తుతుంది. తన తదుపరి చిత్రానికి కొత్త కథాంశం దొరక్క సతమతమవుతున్న రౌల్ అనే ఒక విలక్షణ దర్శకుడి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. కథ ముందుకు సాగుతున్న కొద్దీ తాను ఎదుర్కొన్న విషాదాన్నే తన కొత్త కథకు స్ఫూర్తిగా అతడు మలచుకుంటాడు.

ఈ ఏడాది కేన్స్, టొరంటో, సాన్ సెబాస్టియన్ లాంటి ప్రతిష్ఠాత్మక చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన ఈ చిత్రం ఇఫీలో ఇండియా ప్రీమియర్‌కు సిద్ధంగా ఉంది.

హువానా మాసియాస్ దర్శకత్వంలో 2026లో తెరకెక్కిన ఈ చిత్రం... పార్కిన్సన్స్ వ్యాధి బారిన పడిన ఒక యువతి కథను చెబుతుంది. తనకు ఎదరవుతున్న కష్టాలకు తలొగ్గకుండా భిన్నంగా, ఉత్సాహంగా జీవించాలని ఆమె ధైర్యంగా నిర్ణయించుకుంటుంది. ఇదే వ్యాధితో బాధపడుతున్న తన మ్యూజిక్ థెరపీ బృందం సభ్యులు అందించిన తోడ్పాటుతో పార్కిన్సన్స్‌తో పోరాడుతున్న ప్రముఖ నటుడు మైఖేల్ జె. ఫాక్స్‌ను కలిసేందుకు ఆమె ప్రయాణమవుతుంది. కామెడీ డ్రామా నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఇఫీ-2026 వేదికగా వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమైంది.

స్పానిష్ నటుడు, దర్శకుడు హైమే లోరెంటే దర్శకుడిగా పరిచయమవుతున్న తొలి చిత్రం ఎల్ మాల్ ఈహో. ఈ చిత్రం ఇఫీ-2026 వేదికగా ఆసియా ప్రీమియర్‌కు సిద్ధమైంది. తరతరాలుగా వెంటాడే మానసిక వేదన, కుటుంబ సంబంధాలను ఈ చిత్రం హృద్యంగా ఆవిష్కరిస్తుంది. గతంలో శాన్ సెబాస్టియన్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఈ సినిమాను ప్రదర్శించారు. ఈ కథ 11 ఏళ్ల వయసులోనే తండ్రి వదిలేయడంతో తనకు పెద్దగా పరిచయం లేని బామ్మ వద్దకు చేరిన ఒక వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. తనను వేధించే చేదు జ్ఞాపకాలను ఎదుర్కొంటూ, కుటుంబంలోని కల్లోల గతాన్ని ఛేదించే క్రమంలో, తరతరాలుగా కొనసాగుతున్న మానసిక గాయాల పరంపరకు ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తాడు.లారా అల్వేయా, హోసే ఒర్టునో దర్శకత్వంలో 2025లో ట్రినిడాడ్ చిత్రం తెరకెక్కింది. 19వ శతాబ్దం చివరి కాలంలో వైల్డ్ వెస్ట్ ప్రాంతానికి పారిపోయిన ఓ స్పానిష్ యువతి సాహసాలను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. చేయని నేరాన్ని తనపై మోపడంతో మహిళా బందిపోట్ల బృందంతో ఆ యువతి చేతులు కలుపుతుంది. పోరాటాలు, ప్రమాదాలు, ప్రతీకారంతో నిండిన సాహసయాత్రను ఆమె కొనసాగిస్తుంది. ఈ యాక్షన్ చిత్రం ఇఫీ-2026 వేదికగా వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమైంది.

తిరుపతిలో వెలమ సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన

వరంగల్, నవంబర్ 16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో కోటగిరి సీతాదేవి బుచ్చినాయన వెలమ సంక్షేమ భవన్ నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో తెలంగాణ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు.

వెలమ సామాజిక వర్గ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ భవన్ నిర్మాణానికి పలువురు ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక ఐక్యత, సంక్షేమ కార్యక్రమాల ప్రాధాన్యతను నాయకులు ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో ఏఐవిఏ అధ్యక్షులు పాపారావు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణ, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ, మాజీ ఏఐవి ఏ అధ్యక్షులు సుధాకర్ రావు, భానుప్రసాద్, తెలంగాణ వెలమ కార్పొరేషన్ చైర్మన్ నర్సింగరావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

యూరప్ నుంచి పోస్టల్ పార్శిల్‌లో అక్రమంగా తరలిస్తున్న 10.8 కిలోల యాంఫెటమైన్ సీజ్... చట్టబద్ధమైన పోస్టల్ వాణిజ్య మార్గాలను దుర్వినియోగం చేయాలన్న సిండికేట్ ప్రయత్నం భగ్నం

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: వివిధ వాణిజ్య మార్గాలపై నిరంతర నిఘాలో భాగంగా అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ యత్నాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) విజయవంతంగా భగ్నం చేసింది. ఈ ఆపరేషన్‌లో 10.8 కిలోల యాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకుంది. భారతదేశంలోకి అక్రమ రవాణా చేసేందుకు చట్టబద్ధమైన పోస్టల్ మార్గాలను దుర్వినియోగం చేయాలన్న మాదకద్రవ్యాల సిండికేట్ ప్రయత్నాన్ని అడ్డుకున్నారు.

కచ్చితమైన సమాచారం ఆధారంగా రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) అధికారులు న్యూఢిల్లీలోని ఫారిన్ పోస్టాఫీసులో అనుమానాస్పద పార్శిళ్లను అడ్డగించి తనిఖీ చేశారు. యూరప్ నుంచి వచ్చిన ఈ పార్శిళ్లలో "క్లైరెన్" (దుస్తులు) ఉన్నట్లు నిర్ధారించారు. షిప్పింగ్ కార్టన్‌ను పరిశీలించగా మొదటగా సాధారణ గృహ వినియోగ దుస్తులు కనిపించాయి. అయితే, ప్యాకింగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా డ్రగ్స్‌ను దాచిపెట్టినట్లు అధికారులు గుర్తించారు. కార్టన్‌లోని ప్రతివైపు రెండు చొప్పున నాలుగు వైపులా మొత్తం ఎనిమిది ప్లాస్టిక్ ప్యాకెట్లను చాకచక్యంగా దాచిపెట్టారు.

మొత్తం ఎనిమిది ప్యాకెట్ల నుంచి గులాబీ రంగులో ఉన్న పొడిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాన్ని పరీక్షించగా యాంఫెటమైన్‌గా నిర్ధారణ అయింది. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం-1985లోని సంబంధిత నిబంధనల ప్రకారం ఈ అక్రమ రవాణాకు సంబంధించిన ఎనిమిది ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణా వెనుకున్న విస్తృత వ్యవస్థను చేధించేందుకు ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

నిఘా ఆధారిత చర్యలు, సరిహద్దు రవాణాపై నిరంతరం పెంచుతున్న నిఘా ద్వారా చట్టబద్ధమైన వాణిజ్యం ముసుగులో సాగుతున్న అక్రమ రవాణా వ్యవస్థలను గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు, నిర్మూలించేందుకు డీఆర్ఐ దృఢ సంకల్పంతో ఉంది. భారతదేశ ఆర్థిక సరిహద్దులను, జాతీయ భద్రతను పరిరక్షించటంలో డీఆర్ఐ నిబద్ధతతో పనిచేస్తోంది.

ఐఎఫ్ఎఫ్ఐ-2026లో మలయాళ సినిమా సందడి

న్యూఢిల్లీ, నవంబర్ 16:మలయాళ చలనచిత్ర సీమలో 'ఎవర్‌గ్రీన్ రొమాంటిక్ హీరో'గా సుప్రసిద్ధుడైన నటుడు ప్రేమ్ నజీర్ చిరస్మరణీయ వారసత్వం నుంచి నవతరం దర్శకుల వినూత్న కథాకథనాల దాకా గోవాలో నిర్వహించే 57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) ఆ భాషా చిత్రాల సునంవన్నతను, వైవిధ్యాన్ని ప్రపంచం ముందుంచుతోంది.

ఈ మేరకు మలయాళ సినిమా అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా దిగ్గజ నటుడు ప్రేమ్ నజీర్ నటించిన 'తులాభారం' చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. భారతీయ చలనచిత్ర రంగ ప్రముఖుల శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది. తద్వారా భారత చలనచిత్ర రంగ చరిత్రపై చెరగని ముద్ర వేసిన చిత్రాలను, నటనా వైదుష్యాన్ని మరోసారి వీక్షించే అవకాశం ప్రేక్షకులకు లభిస్తోంది.

సమకాలీన మలయాళ సినిమాకు ప్రాతినిధ్యం వహిస్తూ- అఖిల్ సత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్వం మాయ' చిత్రం "ఇండియన్ పనోరమా" విభాగంలో ప్రదర్శనకు ఎంపికైంది. ఇది నివిన్ పౌలీ, అజు వర్గీస్, రియా షిబు, ప్రీతి ముకుందన్ వంటి ప్రసిద్ధ కళాకారులు నటించిన అలౌకిక డ్రామా. ఇందులో నాస్తికుడైన ఒక సంగీత విద్వాంసుడు (ప్రభేందు) ఒక యువతి ఆత్మతో విలక్షణ బంధం ఏర్పరచుకుంటాడు. ఈ క్రమంలో విశ్వాసం, ప్రేమ, ఆత్మశోధనతో కూడిన అతడిలోని భావోద్వేగాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

దీంతోపాటు 'ఇండియన్ పనోరమా' కింద 'న్యూ హ్యారైజన్' విభాగంలో శ్రుతి శరణ్యం దర్శకత్వం వహించిన 'ఒట్టాంజావాళ్మరం', శ్రీహరి హరిదాస్ దర్శకత్వం వహించిన 'అజయంతే మరణం: ఒరు కేస్ స్టడీ' మలయాళ చిత్రాలకూ స్థానం లభించింది. సందీప్ ఫ్రాన్సిస్ దర్శకత్వంలో రూపొందిన 11 నిమిషాల లఘు చిత్రం 'స్విచ్ ఆఫ్' కూడా ఈ ఉత్సవాల్లో ప్రదర్శితమవుతుంది. అలాగే, కేరళం దర్శకుడు సంజాద్ రూపొందించిన 'హాఫ్' చిత్రాన్ని 'గాలా ప్రీమియర్స్' విభాగంలో ప్రదర్శిస్తారు. మలయాళ సినిమా ప్రత్యేకత చాటే విభిన్న ఇతివృత్తాలు, కథాకథనాలను ఈ చిత్రాలన్నీ ప్రతిబింబిస్తాయి.

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



ములుగు నవంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.

సోమవారం నవీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు.

అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 7, ఇందిరమ్మ ఇండ్లు 2, పింఛన్లు 4, ఇతర శాఖలకు సంబంధించినవి 9 కలిపి మొత్తం 22 దరఖాస్తులు అందాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కరువు జిల్లాగా ప్రకటించాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం. ములుగు జిల్లా.
-రాష్ట్ర ఉపాధ్యక్షులు నెట్టెం నారాయణ.
-ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా.



ములుగు నవంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): ఈరోజు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ములుగు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రజావాణిలో భాగంగా ములుగు జిల్లా అదనపు కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ములుగు జిల్లా పూర్తిగా వ్యవసాయం పైన ఆధారపడి ఆయా పంటలు పండించే జిల్లా కనుక ఏలినో కారణంగా జిల్లాలోని ఆయా పంటలు ఎండిపోయి రైతాంగానికి అపార నష్టం జరిగింది. కావున ములుగు జిల్లాలోని క్షేత్రస్థాయిలో వివిధ రకాల పంటలను పరిశీలించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పంటలకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. వరికి ఎకరానికి 50,000 ప్రత్తికి ఎకరానికి 60 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేయడం జరిగింది. పంట రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరడం జరిగింది. ములుగు జిల్లాలోని సాగునీటి వనరులను ఈ ఎలినో సందర్భంగా పూర్తి చేయాలన్నారు. రామప్ప నుండి లక్నవరం కాలువ పనులు వెంటనే ప్రారంభించా. ఈ వినతిపత్రం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు నెట్టెం నారాయణ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి అంజాద్ పాషా రైతు సంఘం మండల నాయకులు బోడ రమేష్ మంకిడి కృష్ణయ్య ఈసం మహేందర్ ఫ్రీడం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి వచ్చిన కన్సెంట్ మేనేజర్ రిజిస్ట్రేషన్ నియమావళి

-ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభించిన మెయిటీ కార్యదర్శి

న్యూ ఢిల్లీ, నవంబర్ 16: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం-2023 ప్రకారం కన్సెంట్ మేనేజర్ల రిజిస్ట్రేషన్ నియమావళి 2026 నవంబర్ 13న అమల్లోకి వచ్చింది. ఈ దశ అమల్లో భాగంగా కన్సెంట్ మేనేజర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హత కలిగిన సంస్థలు దరఖాస్తు చేసేందుకు వీలుగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మెయిటీ) కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ పోర్టల్‌ను ప్రారంభించారు.

తమ వ్యక్తిగత డేటాకు సంబంధించిన అనుమతులపై డేటా ప్రిన్సిపల్స్‌కు మరింత నియంత్రణను అందించే వ్యవస్థను కార్యరూపంలోకి తీసుకువచ్చే దిశగా వేసిన ముందుగును ఈ నియమావళి సూచిస్తుంది. దశలవారీగా అమలు చేస్తున్న డీపీడీపీ నియమావళిలో ఇది ఒక భాగం. ఇది అర్హత కలిగిన సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, కన్సెంట్ మేనేజ్‌మెంట్ సర్వీసులను అందించేలా నన్నద్ధమయ్యేందుకు వీలు కల్పిస్తుంది.

కన్సెంట్ మేనేజర్ అంటే డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియా (బోర్డు) వద్ద నమోదైన సంస్థ. ఇది అందుబాటులో ఉండే, పారదర్శకమైన, వివిధ వ్యవస్థల మధ్య సమన్వయానికి వీలు కల్పించే వేదిక ద్వారా డేటా ప్రిన్సిపల్స్ తమ సమ్మతిని తెలియజేయడానికి, నిర్వహణకు, సమీక్షించడానికి, ఉపసంహరించుకోవడానికి వీలును కల్పిస్తుంది. డేటా ప్రిన్సిపల్స్‌కు కన్సెంట్ మేనేజర్లు జవాబుదారీగా ఉండేలా చూస్తూ డిజిటల్ వ్యవస్థలో విశ్వసనీయతను, జవాబుదారీతనాన్ని ఈ నియమావళి బలోపేతం చేస్తుంది.

కనీసం రూ. 2 కోట్ల నికర విలువతో తగిన సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి భారత్‌లో నమోదైన కంపెనీలు కన్సెంట్ మేనేజర్లుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. నమోదైన సంస్థలు సురక్షితమైన, నమ్మకమైన, జవాబు దారీతనంతో కూడిన సేవలను అందించడానికి అవసరమైన వనరులు, సామర్థ్యాలను కలిగి ఉండేలా చూడటమే ఈ నిబంధనల ఉద్దేశం.

అర్హత కలిగిన కంపెనీలు రిజిస్ట్రేషన్ కోసం కొత్తగా ప్రారంభించిన పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులు నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో బోర్డు పరిశీలిస్తుంది. అర్హత సాధించిన కంపెనీలను నమోదు చేస్తుంది. నమోదైన కన్సెంట్ మేనేజర్ల జాబితాను బోర్డు వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతారు.

డేటా ప్రిన్సిపల్స్ హక్కులు, డేటా నిర్వహణ సంస్థల బాధ్యతలు, అలాగే బోర్డు విచారణ, జరిమానా విధింపు ప్రక్రియలకు సంబంధించిన ఇతర కీలక నిబంధనలు 2027 మే 13 నుంచి అమల్లోకి రానున్నాయి.

టెక్స్‌టైల్ పార్క్‌లో చేయూత పెన్షన్లు పంపిణీ..

మంత్రి సీతక్క చే మంజూరు పత్రాలు..
బుధవారం పంపిణీ కి ఏర్పాట్లు..
వేదిక ను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్..

వరంగల్, నవంబర్ 16: వరంగల్ జిల్లా సంగెం, గీసుగొండ మండలాల పరిధిలోని స్టేషన్ చింతలపల్లి వద్ద ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పైలాన్ ప్రాంతంలో బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ చేతుల మీదుగా నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పెన్షన్లను లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.



ఈ నేపథ్యంలో సోమవారం వరంగల్ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కార్యక్రమానికి సంబంధించి సభా ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా సభా ప్రాంగణం, వేదిక, లబ్ధిదారులు మరియు ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే పెన్షన్ లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అలాగే వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జడ్పీ సీఈఓ వసంత, గీసుగొండ మండల తహసీల్దార్ రియాజుద్దీన్, సంగెం మండల తహసీల్దార్ రాజ్‌కుమార్, గీసుగొండ ఎంపీడీవో రమేష్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల సంకెళ్లు తెంచుదాం... మూర్ఛ బాధితులకు భరోసా ఇద్దాం..

నవంబర్ 17...జాతీయ మూర్ఛ అవగాహన దినోత్సవం

మానవ నాగరికత అంతరిక్షపు అంచులను తాకుతూ, కృత్రిమ మేధస్సుతో అద్భుతాలు సృష్టిస్తున్న ఈ ఆధునిక యుగంలోనూ, కొన్ని వైద్యపరమైన రుగ్మతల పట్ల సమాజంలో గూడుకట్టుకున్న మూఢనమ్మకాలు, అజ్ఞానపు చీకట్లు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. అటువంటి వాటిలో ప్రధానమైనది 'మూర్ఛ వ్యాధి' (ఎపిలెప్సీ). మూర్ఛ అనగానే మన సమాజంలో ఇప్పటికీ ఎన్నో అపోహలు, అనవసరపు భయాలు, అపనమ్మకాలు తాండవిస్తున్నాయి. ఎవరికైనా హఠాత్తుగా ఫిట్స్ వచ్చినప్పుడు, ఆ వ్యక్తిని దయ్యం పట్టిందనో, దేవత ఆవహించిందనో, లేక పూర్వజన్మ పాపఫలమనో భావించేవారు నేటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా నగరాల్లోనూ కనిపించడం విచారకరం. మరికొందరైతే మూర్ఛ వ్యాధిగ్రస్తులను ఒక అంటరానివారిలా దూరంగా ఉంచుతూ, వారిని వివాహాలకు, శుభకార్యాలకు అనర్హులుగా ముద్రవేస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. విద్యావంతులు సైతం ఈ వ్యాధి పట్ల సరైన శాస్త్రీయ అవగాహన లేకపోవడం వల్ల బాధితుల పట్ల వివక్ష చూపుతున్నారు. వాస్తవానికి మూర్ఛ అనేది ఏ మాత్రం అంటువ్యాధి కాదు; అది కేవలం మన మెదడులోని కోట్లాది నాడీకణాల మధ్య జరిగే విద్యుత్ ప్రసారాల్లో తాత్కాలికంగా ఏర్పడే అసాధారణ మార్పుల వల్ల కలిగే ఒక నాడీ సంబంధిత (న్యూరోలాజికల్) పరిస్థితి మాత్రమే. ఆకాశంలో మెరుపులు మెరిసినప్పుడు విద్యుత్ తరంగాలు ఏ విధంగానైతే ఒక్కసారిగా ఉప్పొంగుతాయో, అలాగే మెదడులోని నాడీకణాల్లో అకస్మాత్తుగా విద్యుత్ ప్రేరణలు అధికమైనప్పుడు శరీర కదలికలు అదుపుతప్పి మూర్ఛ లక్షణాలు కనిపిస్తాయి. ఇది బాధితుడి ఆలోచనలకు గానీ, సంకల్పానికి గానీ ఏమాత్రం సంబంధం లేని పూర్తిగా వైద్యపరమైన స్థితి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మందికి పైగా ఈ సమస్యతో జీవిస్తుండగా, ఒక్క మన భారతదేశంలోనే దాదాపు కోటి మందికి పైగా మూర్ఛ బాధితులు ఉన్నారు. మన దేశంలో ఏటా నవంబర్ 17వ తేదీన 'జాతీయ మూర్ఛ అవగాహన దినోత్సవం' నిర్వహించుకోవడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ప్రజల మదిలోని అజ్ఞానపు తెరలను తొలగించి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే.

మూర్ఛ వ్యాధి రావడానికి గల కారణాలను విశ్లేషిస్తే, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన లోపాలు, ప్రసవ సమయంలో శిశువు మెదడుకు ఆక్సిజన్ అందకపోవడం, తలకు బలమైన గాయాలు తగలడం, మెదడులో కణుతులు లేదా ఇన్ఫెక్షన్లు రావడం, పక్షవాతం, అధిక జ్వరం వంటి ఎన్నో అంశాలు దోహదం చేస్తాయి. కొందరిలో స్పష్టమైన కారణం తెలియకపోయినా ఈ సమస్య



తలెత్తవచ్చు. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే, అందరిలోనూ ఒకేలా ఉండవు. కొందరు ఉన్నట్టుండి స్పృహతప్పి కిందపడిపోయి, కాళ్లు చేతులు కొట్టుకోవడం, నోటి వెంట నురగ రావడం వంటి తీవ్రమైన లక్షణాలను ప్రదర్శిస్తే, మరికొందరు కేవలం కొన్ని క్షణాల పాటు శూన్యంలోకి చూస్తూ ఉండిపోవడం, కనురెప్పలు వేగంగా కొట్టుకోవడం, అసంకల్పితంగా పెదాలు కదపడం వంటి సూక్ష్మమైన లక్షణాలను కలిగి ఉంటారు.

మూర్ఛ వచ్చినప్పుడు మన సమాజంలో పాటించే కొన్ని మూఢ పద్ధతులు బాధితుల ప్రాణాలకే ముప్పు తెస్తున్నాయి. ముఖ్యంగా ఫిట్స్ వచ్చిన వ్యక్తి చేతిలో ఇనుప వస్తువులు, తాళం చెవులు పెట్టడం, కాళ్లకు, చేతులకు బలంగా మర్దన చేయడం, నీళ్లు తాగించడానికి ప్రయత్నించడం, ముక్కు దగ్గర ఉల్లిపాయలు లేదా చెప్పులు పెట్టడం వంటివి అత్యంత ప్రమాదకరం. మూర్ఛ వచ్చినప్పుడు చేయవలసిన అసలైన ప్రథమ చికిత్స చాలా సులభమైనది మరియు ప్రాణరక్షకమైనది. బాధితుడిని వెంటనే ఒక పక్కకు (ఎడమ లేదా కుడి వైపుకు) తిప్పి పడుకోబెట్టాలి, తద్వారా నోటిలోని లాలాజలం ఊపిరితిత్తుల్లోకి వెళ్లకుండా శ్వాసమార్గం సుగమమవుతుంది. తల కింద మెత్తని వస్త్రం లేదా దిండు ఉంచాలి, మెడ వద్ద దుస్తులను వదులు చేయాలి, చుట్టూ గుమికూడకుండా గాలి తగిలేలా చూడాలి మరియు నోట్లో వేళ్లు గానీ, ఇతర వస్తువులు గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టకూడదు. సాధారణంగా రెండు మూడు నిమిషాల్లో మూర్ఛ దానంతట అదే తగ్గిపోతుంది; ఒకవేళ ఐదు నిమిషాలకు మించి కొనసాగితే తక్షణమే ఆసుపత్రికి తరలించాలి. నేటి ఆధునిక వైద్య శాస్త్రంలో ఈ వ్యాధికి అత్యంత సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉంది. ఈఈజీ (ఇఇఉ), ఎంఆర్ఐ (ఓఖీఏ) వంటి పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను కచ్చితంగా నిర్ధారించి, సరైన యాంటీ-ఎపిలెప్టిక్ మందులను క్రమం తప్పకుండా వాడటం ద్వారా సుమారు డెబ్భై శాతం మంది బాధితులు మూర్ఛను పూర్తిగా నియంత్రించుకోగలుగుతున్నారు.

మందులతో నయం కాని కొద్దిమందికి శస్త్రచికిత్సలు, ప్రత్యేక ఆహార నియమాలు (కీటోజెనిక్ డైట్) కూడా అద్భుత ఫలితాలను ఇస్తున్నాయి. మూర్ఛ అనేది మనిషి మేధస్సుకు గానీ, ప్రతిభకు గానీ ఏమాత్రం అడ్డంకి కాదు. ప్రపంచ చరిత్రను మలుపుతిప్పిన జూలియస్ సీజర్, అలెగ్జాండర్ ది గ్రేట్, ప్రముఖ శాస్త్రవేత్తల్లోడ్ నోబెల్, చిత్రకారుడు విన్సెంట్ వాన్ గో వంటి మహామహులు మూర్ఛ వ్యాధితో పోరాడుతూనే తమ రంగాల్లో శిఖరాలను అధిరోహించారు. కాబట్టి, మూర్ఛ బాధితులను జాలితోనో, భయంతోనో కాకుండా ఆప్యాయతతో, ఆత్మగౌరవంతో ఆదరించాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పని ప్రదేశాల్లో సహోద్యోగులు, కుటుంబంలో ఆత్మీయులు వారికి కొండంత అండగా నిలబడి, సకాలంలో మందులు వేసుకునేలా ప్రోత్సహించాలి. అపోహల సంకెళ్లను తెంచుకుని, శాస్త్రీయ అవగాహన అనే వెలుగును ప్రతి ఇంటా నింపినప్పుడే మూర్ఛ బాధితుల జీవితాల్లో ఆత్మవిశ్వాసపు వసంతం వికసిస్తుంది; అది మనందరి సామాజిక బాధ్యత కూడా!

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



రామానుజన్ గణిత ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా

తుది దశకు 41 మంది విద్యార్థులు ఎంపిక..
ఉత్సాహంగా పరీక్ష రాసిన విద్యార్థులు



కరీంనగర్, నవంబర్ 16: (నేటినిజం ప్రతినిధి) గణిత శాస్త్రంపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో తార్కిక ఆలోచనా శక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో గణిత ఒలింపియాడ్ పోటీలు ఎంతో దోహదపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల నుంచి ఏకంగా 41 మంది విద్యార్థులు రామానుజన్ గణిత ఒలింపియాడ్ తుది దశకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రామచంద్రాపురానికి చెందిన రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ మ్యాథమెటిక్స్ టాలెంట్ సెర్చ్ కాంపిటీషన్‌లో భాగంగా రామానుజన్ గణిత ఒలింపియాడ్ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందిన 41 మంది విద్యార్థులు తుది దశకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం (నవంబర్ 15) పాఠశాలలో నిర్వహించిన తుది దశ పరీక్షకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గణిత ఒలింపియాడ్‌లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో లాజికల్ థింకింగ్, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. క్లిష్టమైన గణిత సమస్యలను సైతం సులభంగా, వేగంగా పరిష్కరించే నైపుణ్యం అలవడుతుందని పేర్కొన్నారు. ఇతర విద్యార్థులతో పోటీపడటం ద్వారా ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందుతుందని, వివిధ స్థాయిల్లో జరిగే పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని వివరించారు. గణితంలో ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఇలాంటి పోటీలు చక్కటి వేదికగా నిలుస్తాయని అన్నారు. మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థుల్లో గణిత ప్రతిభను వెలికితీసేందుకు ఈ ఒలింపియాడ్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు వారి విజయానికి నిరంతరం మార్గదర్శనం అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం గొప్ప అవకాశమని, తుది దశ పరీక్షలోనూ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..
కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

వివిధ బాధ్యతలు చేపట్టిన చిన్నారులు..



రాజన్న సిరిసిల్ల,నవంబర్ 16: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో వేములవాడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు వివిధ తరగతులకు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠాలను బోధించడం, తోటి విద్యార్థులను ప్రశ్నించడం, తరగతి గదిలో క్రమశిక్షణను పర్యవేక్షించడం వంటి బాధ్యతలను ఎంతో ఆత్మవిశ్వాసంతో నిర్వర్తించారు. మరికొందరు విద్యార్థులు డైరెక్టర్, ప్రిన్సిపాల్, అకౌంటెంట్, ఇన్‌చార్జిలు, ఫ్లోర్ ఇన్‌చార్జిలు, పీఈటీలు, బౌన్సర్లుగా బాధ్యతలు చేపట్టి పాఠశాల నిర్వహణలో తమ ప్రతిభను చాటుకున్నారు.అదేవిధంగా ప్రీ ప్రైమరీ చిన్నారుల కోసం ప్రత్యేకంగా వినోదభరితమైన ఆటలు, సరదా పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయుల బాధ్యతలు, సహనం, అంకితభావం, శ్రమ విలువను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలిగింది.

అంతేకాకుండా నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటేష్ విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నేటి విద్యార్థులే రేపటి నాయకులని, ప్రతి చిన్నారిలోనూ గొప్ప భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం, ఆటపాటలు, వినూత్న కార్యక్రమాల నడుమ బాలల దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

శిశువుల సున్నితమైన చర్మ సంరక్షణకు
హిమాలయ బేబీకేర్ ప్రత్యేక సబ్బు



విజయవాడ , నవంబర్ 17: శిశువుల సున్నితమైన, పొడి చర్మ సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ హిమాలయ బేబీకేర్ తన 'ఎక్స్‌ట్రా మాయిశ్చరైజింగ్ బేబీ సోప్'పై నూతన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. వైద్యులు అత్యధికంగా సిఫార్సు చేసే బ్రాండ్‌గా గుర్తింపు పొందిన హిమాలయ బేబీకేర్, శిశువులకు స్నానం చేయించడం కేవలం శుభ్రత కోసమే కాకుండా చర్మానికి అవసరమైన తేమను అందించేందుకు కూడా ఉపయోగపడాలని ఈ ప్రచారం ద్వారా తెలియజేస్తోంది. ముఖ్యంగా చలికాలంలో శిశువుల చర్మం పొడిబారకుండా సంరక్షించేందుకు ఈ సబ్బును ప్రత్యేకంగా రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. కలబంద, పాల సుగుణాలతో కూడిన 'అలో?మిల్క్ మాయిశ్చర్ కాంప్లెక్స్' శిశువుల సున్నితమైన చర్మానికి తేమను అందించడంలో సహాయపడుతుందని తెలిపింది. వైద్యపరమైన పరీక్షలు నిర్వహించిన ఈ సబ్బులో కృత్రిమ రంగులు, పారాబెన్లు, థాలేట్లు ఉండవని పేర్కొంది. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బేబీకేర్ విభాగం డైరెక్టర్ ఎన్.వి. చక్రవర్తి మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్యం, సౌకర్యం కోసం తల్లిదండ్రులు సరైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. తమ ఎక్స్‌ట్రా మాయిశ్చరైజింగ్ బేబీ సోప్ శుభ్రతతోపాటు చర్మానికి తేమను అందించేలా రూపొందించామని తెలిపారు. శిశువుల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సున్నితమైన ఉత్పత్తులను అందించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఆయుర్వేద విజ్ఞానం, మూలికలపై పరిశోధనల ఆధారంగా శిశువుల రోజువారీ చర్మ సంరక్షణకు అనువైన ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్నట్లు హిమాలయ బేబీకేర్ వెల్లడించింది.

సైక్లింగ్ క్రీడలతోనే బంగారు భవిష్యత్తు



కరీంనగర్, నవంబర్ 16: ప్రపంచవ్యాప్తంగా సైక్లింగ్ క్రీడకు మంచి గుర్తింపు ఉందని? సైక్లింగ్ క్రీడలతో బంగారు భవిష్యత్తు ఏర్పడుతోందని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ వెలోడ్రాం లో అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ (సౌత్ ఇండియా జోన్) క్రీడా పోటీల ప్రారంభం అయ్యాయి.

ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సైక్లింగ్ టీం పాల్గొని ప్రశంసలు అందుకుంది. కరీంనగర్ టీం ను ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు భారతీయ రైల్వేలు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ శాఖల తోపాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో స్పోర్ట్స్ కోటా కింద నేరుగా ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేశారు.

సైక్లింగ్ కు సంబంధించిన రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ఉన్నత విద్యా కోర్సులలో ప్రత్యేక స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్ కాంతారావు, సైక్లింగ్ కోచ్ చంద్రారెడ్డి, మ్యాక్స్ వెల్ పెద్దపెల్లి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు అసంపల్లి శ్రీనివాస్, సెక్రటరీ తగరపు శంకర్, కరీంనగర్ సైక్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సురభి వేణుగోపాల్, సుల్తానాబాద్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

నూతన పెన్షన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి మంజూరు పత్రాల అందజేత



ఖమ్మం, నవంబర్ 16: అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందించాలనే లక్ష్యంతో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో ఆమె ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని నూతన పెన్షన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి మంజూరు పత్రాలను అందజేశారు. ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలోనే కాకుండా, పదవిలో లేనప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న శ్రావణి సుధాకర్ సేవలను స్థానికులు అభినందించారు.

పెన్షన్ మంజూరు పత్రాలను స్వయంగా ఇళ్లకు వెళ్లి అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రావణి సుధాకర్ మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారం, ఆశీస్సులతో డివిజన్ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మోతుకూరి శ్రీనివాస్, మదగాని దుర్గా, తుపాకుల రవి, రషీద్, కుమార్, ఓర్సు రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఆదిలాబాద్, నవంబర్ 16:దండేపల్లి మండలంలోని దండేపల్లి, వెల్లనూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం చైర్మన్ ముత్యాల శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని తెలిపారు.

కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ బిళ్లకూరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం త్రిమూర్తి, ఆయా గ్రామాల సర్పంచులు మానస తులసి, అజ్మీర రాజేశ్వర్ నాయక్, ఉపసర్పంచులు శ్రీలత లక్ష్మణ్, సిరికొండ నవీన్, ఏపీఎం తోట లక్ష్మి, ఆయా గ్రామాల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar,
Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.